ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 4 నవంబరు 2024



శిల్ప కళలో దిట్ట పరమేశ్వరరావు

» దేవతామూర్తుల విగ్రహాల తయారీపై బాల్యంలోనే ఆసక్తి

» మనసులో మెదిలే రూపాలకు శిల్పాల ఆవిష్కరణ

- 8వ పేజీలో



నక్కపల్లికి మహర్దశ

మెగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు సంసిద్ధత

» మొత్తం పెట్టుబడులు రూ.1.4 లక్షల కోట్లు

» మొదటి దశలో రూ.70 వేల కోట్లు

» రాష్ట్ర ప్రభుత్వ పిలుపుతో వేగంగా స్పందించిన ప్రముఖ స్టీల్ కంపెనీలు

» అందుబాటులో వీసీఐసీ భూములు

» వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో శంకుస్థాపన?

» సాకారం అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి

» జిల్లా వాసుల్లో హర్షాతిరేకాలు



విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది ఈ ప్రాంతంలోనే

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలానికి మహర్దశ పట్టనున్నది. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్‌లో భారీ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కానున్నది. ప్రైవేటు రంగంలో సుమారు 1.4 లక్షల కోట్ల రూపాయలతో స్టీల్ ప్లాంట్ నిర్మించడానికి భారత్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీలు ముందుకు వచ్చాయి. కొద్ది రోజుల్లోనే ఈ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై, మిగిలిన అంశాల గురించి చర్చిస్తారని సమాచారం. లాంఛనాలన్నీ పూర్తయితే వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో శంకుస్థాపన చేస్తారని తెలిసింది. నక్కపల్లి మండలంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు విషయాన్ని శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎం చంద్ర బాబు ప్రకటించడంతో నియోజకవర్గం ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేట నియోజకవర్గాన్ని ప్రగతి బాటలో నిలిపి, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలని తొమ్మిదేళ్ల ఏళ్ల కిందటే సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. నవ్యాంధ్ర తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు.. పాయకరావుపేట నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో 2015లో 'విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) పేరుతో భూ సేకరణకు శ్రీకారం చుట్టారు. చంద్రబాబుపై వున్న నమ్మకంతో నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు భూములు ఇచ్చారు. అప్పట్లో జిరాయితీతోపాటు డి.పట్టా భూములకు కూడా ప్రభుత్వం సంతృప్తికరమైన పరిహారం ఇచ్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఇండస్ట్రియల్ కారిడార్‌ను నాలుగేళ్లపాటు పట్టించుకోలేదు. గత ఏడాది ఇక్కడ బల్క్ డ్రగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఇది కార్యరూపం దాల్చలేదు. తరువాత ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకురావాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రైవేటు రంగంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. లోకేశ్ అమెరికా పర్యటనలో వున్నప్పుడు పలువురు ప్రపంచస్థాయి పారిశ్రామిక వేత్తలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు గురించి మాట్లాడారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీ సానుకూలంగా స్పందించాయి. లక్షా 40 వేల కోట్ల రూపాయల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. రూ.70 వేల కోట్లతో మొదటి దశ నిర్మాణం చేపడతారు. ఉక్కు ఫ్యాక్టరీ మొదటి దశ ఏర్పాటుకు 2,640 ఎకరాల భూములు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. నక్కపల్లి మండలంలో 'విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇప్పటికే భూములు సేకరించి వున్నందున కొత్తగా భూ సేకరణ చేపట్టాల్సిన పనిలేదు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు మండలంలోని రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, ఎన్.నర్సాపురం, వేంపాడు, డీఎల్ పురం రెవెన్యూ గ్రామాల్లోని వీసీఐసీ భూములు



శాటిలైట్ పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదిత రాజయ్యపేట సముద్ర తీర ప్రాంతం

... మిగతా 8వ పేజీలో

మద్యం అమ్మకాలపై నిఘా

ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక తనిఖీ బృందం ఏర్పాటు

» ఎమ్మార్పీకన్నా ఎక్కువకు అమ్మితే చర్యలు

» బెల్ట్ షాపులపై దాడులు

» పట్టుబడిన మద్యం ఏ దుకాణం నుంచి వచ్చిందో గుర్తింపు

» నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటి తప్పుగా రూ.5 లక్షలు జరిమానా

» రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దు



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)


మద్యం వ్యాపారం ప్రారంభించి ఇంకా రెండు వారాలు కూడా కాలేదు.. జిల్లాలో ప్రైవేటు మద్యం వ్యాపారుల ఆగడాలు హద్దులు దాటిపోతున్నాయి. ప్రభుత్వం అనుమతించకపోయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బెల్ట్ షాపులకు అనుమతి ఇచ్చేస్తున్నారు. లైసెన్సుడ్ షాపుల్లో సైతం ఎమ్మార్పీకన్నా ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానిక పెద్దలు గ్రామాభివృద్ధి, గ్రామ దేవతల ఉత్సవాలకు నిధుల పేరుతో మద్యం బెల్ట్ షాపులు నడుపుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాకులు ఒక్కో సీసాపై పరిమాణాన్నిబట్టి రూ.10 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకుల నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని ఇటీవల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులతో జరిపిన సమీక్షలో ఆదేశించారు. దీంతో మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకులు, అధిక రేట్లకు మద్యం విక్రయించే వారిపై కొరడా ఝుళిపించేందుకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 136 మద్యం షాపులను గత నెలలో ప్రైవేటు వ్యక్తులకు లాటరీ విధానంలో కేటాయించిన విషయం తెలిసిందే. గతంలో మద్యం వ్యాపారం చేసిన వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేశారు. లాటరీలో మద్యం షాపులను దక్కించుకున్న కొందరు వ్యాపారులు ఎమ్మార్పీకన్నా ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కన్నా ఒక్క రూపాయి కూడా ఎక్కువకు అమ్మకూడదు. కానీ క్వార్టర్ సీసాపై రూ.10, హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్‌బాటిల్‌పై రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకాణాలను తెరిచిన ఒకటి, రెండు రోజులకే బెల్ట్ షాపులను ప్రోత్సహించారు. మద్యం షాపు దక్కించుకోనేందుకు లక్షలా రూపాయిలు ఖర్చు చేశామని, లైసెన్సుడ్ దుకాణంలో మాత్రమే మద్యం విక్రయిస్తే తమకు గిట్టుబాటు కాదంటూ బెల్ట్ దుకాణాలకు తెర తీస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామపెద్దల సాయంతో బెల్ట్ షాపుల ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. మద్యం షాపుల

... మిగతా 8వ పేజీలో

కొత్త గూడుకు మోక్షం లేదా?

శిథిలావస్థలో సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం



పురాతన భవనంలో సబ్ ట్రెజరీ కార్యాలయం

» బ్రిటీష్ హయాంలో నిర్మాణం

» వర్షం పడితే శ్లాబ్ నుంచి కారుతున్న నీరు

» తడిసిపోతున్న రికార్డులు

» వైసీపీ హయాంలో నూతన భవన నిర్మాణం ప్రారంభం

» నత్తనడకన సాగుతున్న పనులు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఉపఖజానా(సబ్ ట్రెజరీ) కార్యాలయంలో రికార్డులకు రక్షణ లేకుండాపోయింది. ఎప్పుడో బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే శ్లాబ్ కారిపోతున్నది. దీంతో రికార్డులు తడిసిపోతున్నాయి. బీరువాలోని పాత దస్త్రాలను చెద పురుగులు తినేస్తున్నాయి. వర్షం పడితే ఉద్యోగులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

ప్రస్తుతం ఉన్న నర్సీపట్నం ఉపఖజానా కార్యాలయ భవనం వందేళ్ల నాటిది. అప్పట్లో బ్రిటీష్ పాలకుల హయాంలో నిర్మించినది. ఇక్కడి ఫర్నిచర్ కూడా పాతకాలం నాటిదే. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలోకి అడుగు పెడితే బూత్ బంగ్లాలోకి వెళుతున్న అనుభూతి కలుగుతుంది. వర్షం వస్తే శ్లాబ్ నుంచి నీరుకారిపోయి గదులు తడిసి ముద్దవుతున్నాయి. రికార్డులు తడిసిపోతుండడంతో వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఉద్యోగులు కూడా వర్షపు చినుకులు పడని చోట కుర్చీలు వేసుకుని విధులు నిర్వహించాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. వివిధ పనులపై వచ్చే ప్రజలకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు.



చెదపట్టి పాడైన రికార్డులు

నత్తనడకన కొత్త భవనం నిర్మాణ పనులు

సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం శిథిలావస్థకు ... మిగతా 8వ పేజీలో

మొక్కుబడిగా స్వచ్ఛతే సేవా

ఫొటోలకే పరిమితమైన పరిశుభ్రత కార్యక్రమం

» ఘన వ్యర్థాల నిర్వహణలో పంచాయతీ అధికారులు విఫలం

» ఇళ్ల నుంచి సేకరించిన చెత్త.. ఊరు చివర రోడ్ల పక్కన డంపింగ్

» కుళ్లిపోయి దుర్వాసన.. రోగాలబారిన ప్రజలు

» రహదారుల పక్కన కొనసాగుతున్న బహిరంగ మలవిసర్జన

» వృథాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు



ఖండేపల్లిలో రోడ్డు పక్కన చెత్త కుప్ప. ఈ ప్రదేశంలో మలవిసర్జన సర్వసాధారణంగా మారింది



లక్ష్మీపురం దామునాపల్లి మధ్య రోడ్డుపక్కన చెత్త కుప్ప



చోడవరం నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డు పక్కనడంపింగ్ యార్డు

చోడవరం, నవంబరు 3: పారిశుధ్యలోపం, బహిరంగ మలవిసర్జన వంటివి పల్లెల వాతావరణాన్ని పూర్తిగా కలుషితం చేస్తాయి. గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనను నివారించి, చెత్త లేని ఓ స్వచ్ఛమైన వాతావరణం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛతా హీ సేవా (స్వచ్ఛతే సేవ) కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో ఈ కార్యక్రమం ఫొటోలు దిగడానికి, ప్రసంగాలకే పరిమితం అయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంతో ఉదాత్తమైన లక్ష్యంతో ప్రారంభించిన స్వచ్ఛతే సవా కార్యక్రమాన్ని అధికారులు ఫొటో షూట్‌లకే పరిమితం చేశారు. ఫలితంగా గ్రామాల్లో పరిశుభ్రత నేతిబీరకాయలో నెయ్యి చందంగా మారిపోయింది. యథారాజా తథా ప్రజ అన్న చందంగా పంచాయతీ స్థాయిలో అధికారులు కూడా పారిశుధ్యాన్ని గాలికి వదిలేశారు.

స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా వీధులతోపాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఈ సూచనలను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఒక పక్క స్వచ్ఛతే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోపక్క గ్రామాలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. బహిరంగ మలవిసర్జన కొనసాగుతూనే వుంది. గ్రామాల్లో టీడీపీ హయాంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని, ఘన వ్యర్థాల నిర్వహణ చక్కగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ పంచాయతీరాజ్ శాఖ అధికారుల చెవికెక్కడం లేదు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలేదు. ఇళ్లు, వీధుల్లో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించకుండా, గ్రామాల చివర రహదారుల పక్కన, ఖాళీ స్థలాలు, గెడ్డల్లో పడేస్తున్నారు. ఇది కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలు పలురకాల వ్యాధులు, జ్వరాలబారిన పడుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి, స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

» సముద్రంలో మునిగి యువకుడి మృతి

» అచ్యుతాపురం మండలం సీతపాలెం వద్ద ఘటన

» మృతుడి స్వస్థలం విశాఖలోని నాయుడుపేట ప్రాంతం



మృతిచెందిన అభిరామ్



అభిరామ్‌ను నీటిలో నుంచి పడవలోకి లాగుతున్న మత్స్యకారుడు వాసుపల్లి నూకరాజు

అచ్యుతాపురం/ రాంబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- రాంబిల్లి మండల సరిహద్దులోని సీతపాలెం కొండవద్ద సముద్రంలో మునిగి ఒక యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.

విశాఖ నగరంలోని వేపగుంట ప్రాంతం నాయుడుతోటకు చెందిన సిరిగుడి అభిరామ్ (21), మరో ముగ్గురు యువకులు కలిసి రెండు బైక్‌లపై ఆదివారం ఉదయం 6.30 గంటలకు సీతపాలెం సమీపంలో సముద్ర తీరం వద్దకు వచ్చారు. ఇక్కడ నీటిలో దిగి సరదాగా ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో అభిరామ్ ఒక రాయిపై నిలబడి వుండగా ఒక బలమైన కెరటం అతనిని తాకింది. దీంతో నీటిలో పడి మునిగిపోతుండడంతో మిగిలిన యువకులు.. కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేశారు. సమీపంలో వున్న కొండపాలేనికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి నూకరాజు, పూడిమడక శివారు కడపాలేనికి చెందిన ఎరిపిల్లి కాసులు అలియాస్ కిరణ్, మరో యువకుడు కలిసి పడవపై ఉప్పుటేరులో నుంచి సముద్రంలోకి వెళ్లి నీటిలో మునిగిపోతున్న యువకుడిని పట్టుకుని పడవలోకి చేర్చారు. తాగిన నీటిని బయటకు కక్కించడానికి అతని పొట్టపై గట్టిగా నొక్కారు. అనంతరం తీరానికి చేర్చి స్నేహితులకు అప్పగించారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరిన అభిరామ్‌ను అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అభిరామ్ తండ్రి సిరిగుడి జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ నరసింగరావు చెప్పారు.

చింతపల్లి సీఐ రమేశ్ బదిలీ



చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రమేశ్‌ను బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు చింతపల్లిలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన రమేశ్‌ని విశాఖపట్నం సీటీ వీఆర్‌కి బదిలీ చేయగా, ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా సోషల్‌మీడియా సెల్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వినోద్ బాబుని నియమించారు. సోమవారం నూతన సీఐ విధుల్లో చేరనున్నారు.

9, 10 తేదీల్లో జీఎస్‌యూ శిక్షణ తరగతులు



పోస్టర్లను జీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఈ నెల 9, 10వ తేదీలలో జీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఆదివాసీ సమాజంపై అవగాహన కలిగిన వారితో నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతుల పోస్టర్లను ఆయన క్యాంప్ కార్యాలయంలో జీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న పోటీతత్వాన్ని తట్టుకోనేలక్ష్యం, ఆదివాసీ చట్టాలు, హక్కులు తదితర అంశాలను ఈ శిక్షణ తరగతుల్లో వివరిస్తారన్నారు. జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు, నిరుద్యోగులు, ఆదివాసీలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు రామారావు దొర, కె.తెల్లబాబు,పి.సురేశ్‌కుమార్, బుడిదే మాధవరావు, కిరసాని కిశోర్, ఎం.బాబి, బి.అనీల్, పి.రాంబాబు, శేఖర్, శివ, భీమ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



డీఎస్పీ షహబాజ్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు కోరారు. ఆదివారం నూతనంగా డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షేక్ షహబాజ్ అహమ్మద్‌ను చింతపల్లి, జీకేవీధి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పర్యాటక సీజన్‌లో లంబసింగి, తాజంగి పంచాయతీల పరిధిలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లో చిరంజీవి, మొట్టడం బాలరాజు, మర్రి గురుమూర్తి, గెమ్మెలి సింహాద్రి, కొర్ర సుందరరావు, గుంటా జిన్ను, గెమ్మెలి కృష్ణారావు, వంతల రవి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలపై ఆదివాసీలు ఆసక్తి



సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్న ఆదివాసీలు

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాల స్వీకరణకు ఆదివాసీలు ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం కిటుముల పంచాయతీ రాకోట, బౌడ గ్రామాల్లో 300 మందికి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో టీడీపీకి ప్రజామద్దతు పెరిగిందన్నారు. ఆదివాసీలు ఉత్సాహంగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి వ్యక్తికి రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో సభ్యత్వాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటరావు, నాయకులు రాధాకృష్ణ, కేశవరావు, అప్పలకొండ, భీమన్నపడాల్, బాలూదొర, బస్వన్నదొర, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

ముంచంగిపుట్టు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఈ నెల 5వ తేదీన ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని విశాఖ తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు. రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, ఫోన్ నెంబరు, తదితర వివరాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఉచిత భోజనం, రవాణా సదుపాయం ఉంటుందని చెప్పారు.



హుకుంపేటలో ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు



నిరుపయోగంగా రాళ్లగడ్డవద్ద ఉన్న డంపింగ్ కేంద్రం

డంపింగ్ యార్డును తలపిస్తున్న హుకుంపేట

- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- కాలువలు అధ్వానం.. దోమలు విజృంభణ
- ప్రబలుతున్న విష జ్వరాలు
- పట్టించుకోని పంచాయతీ

హుకుంపేట నవంబరు 3 ఆంధ్రజ్యోతి: మండలం కేంద్రమైన హుకుంపేట చెత్తాచెదారాలు, మురుగు నీటి కాలువలతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతోవ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. రాళ్లగెడ్డ సమీపంలో గతంలో నిర్మించిన డంపింగ్ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయినా పంచాయతీ అధికారులు కనీసం తొలగించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చెత్త, వ్యర్థాల వల్ల దుర్వాసన భరించలేకున్నామని పరిసర కుటుంబాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దోమలు వృద్ధితో మలేరియా, డెంగ్యు ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. గతంలో ప్రతి ఇంట్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నట్టు చెబుతున్నారు. రామాలయం వీధి రోడ్డు, అడ్డుమండలోని వైన్ షాప్ ఉన్న ప్రాంతం, మెయిన్ రోడ్డు చెత్త పేరుకుపోవడంతో అధికారులకు ఫిర్యాదుచేసినా చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంతో నమకంతో ఓట్లు వేసి గెలిపించిన నాయకులూ కనీసం పారిశుధ్యం కల్పనపై దృష్టి సారించలేదని వాపోతున్నారు.మండలంలోని 33 పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు ప్రతి రోజూ తమ అవసరాలకు ఇక్కడికి వస్తుంటారు. ఎక్కడ చూసినా చెత్త కనిపించటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం కల్పనపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ ఆటవిడుపు

- పిల్లలతో కలిసి కొత్తపల్లి జలపాతం సందర్శన



జలపాతం వద్ద పిల్లలతో కలిసి స్నానాలు చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

జిల్లా పెద్దగా నిత్యం అధికారిక కార్యకలాపాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీబిజీ గా ఉండే కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం జి.మాడుగుల మండలంలోకి కొత్తపల్లి జలపాతం వద్దకు తమ పిల్లలతో కలిసి ఆటవిడుపుగా వెళ్లారు. తను జిల్లా కలెక్టర్ అనే భావన లేకుండా సాధారణ సందర్శకుడిలా జలపాతంలో చిన్నారులతో కలసి స్నానం చేశారు. అక్కడున్న వారిని ఆప్యాయంగా పలుకరించడం అందర్నీ విశేషంగా ఆకట్టుకుంది. కలెక్టర్ రావడం ఆనందంగా ఉందని కొత్తపల్లి జలపాతం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. - ఆంధ్రజ్యోతి/పాడేరు

మినుములూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలి



అరకు ఎంపీ తనూజారాణికి వినతిపత్రం అందిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరుతూవైద్యాధికారి గోపాలకృష్ణ సిబ్బందితో కలిసి అరకు ఎంపీ గుమ్మ తనూజారాణికి వినతిపత్రం అందించారు. పాడేరులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. పీహెచ్‌సీలో పరిధిలో అన్ని కేడర్ల సిబ్బంది, ఆశ కార్యకర్తలు సుమారు 254 మంది విధులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. సిబ్బందికి పీహెచ్‌సీలో నెలవారీ సమావేశాలు, శిక్షణలు జరపాల్సి ఉంటుందన్నారు. పీహెచ్‌సీలో సమావేశ మందిరం, తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఇబ్బందికి లోనవుతున్నట్టు వివరించారు. ఎంపీని కలిసిన వారిలో ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, పర్యవేక్షకులు పీవీ వరలక్ష్మి,సిబ్బంది శెట్టి నాగరాజు, కె.లక్ష్మణరావు, జేవీ.చలంపాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం: సీఐటీయూ

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికుల స్థితిగతులు, సమస్యలపై వివిధ సంఘాలు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రికి వివరించినట్టు చెప్పారు. కార్మికుల మధ్య కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విభజించి పాలించే రీతిలో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో కార్మికులు ఏకమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు బి. చిన్నయ్యపడాల్, ఉమామహేశ్వరరావు, ఎల్.సుందరరావు, బి.సన్నిబాబు, పోతురాజు, సత్యనారాయణలున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి



మాట్లాడుతున్న ముక్కలి కల్యాణి

గూడెంకొత్తవీధి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్నారు. పింఛన్ సొమ్ము పెంచిందన్నారు. మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. తాజాగా ఉచిత గ్యాస్ పథకం ప్రారంభించిందన్నారు. త్వరలో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తుందన్నారు. జనవరిలో కొత్త పించన్లు, రేషన్ కార్డులు జారీ చేసేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 25వేల పక్కాగృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తికాని గృహా లకు సైతం నిధులు విడుదల చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్, నాయకులు రాజుబాబు, చిన్నబ్బాయ్యి, జోగిదొర పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై 15న ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

పాడేరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా నిరసన కార్యక్రమాలు తప్పవని జిల్లా యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలపై డీఎంహెచ్‌వో, జిల్లా కలెక్టర్ దృష్టికి వినతులు అందించినా నేటికి సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రం పాడేరులో చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని ఏఎన్ఎంలు విజయవంతం చేయాలన్నారు. రెండవ ఏఎన్ఎంలకు రూ. 22 వేలు జీతం చెల్లించాల్సి ఉండగా ఈ నెలలో కేవలం రూ. 600 మాత్రమే బ్యాంక్ అకౌంట్‌లో జమ కావడం విచారకమన్నారు. అధికారులు స్పందించి ఫేషియల్ హాజరు నుంచి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని, ఇన్సెంటివ్, ఇంక్రిమెంట్‌ల చెల్లింపులు సక్రమంగా చేయాలని, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుష్ప, ముక్తమ్మ, కుమారి, భవాని, అంబిక, పార్వతి, వరలక్ష్మి, శెట్టి నాగరాజు, సీఐటీయూ నాయకులు చిన్నయ్యపడాల్, సుందరరావు, 11 మండలాల పరిధిలోని ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో డౌనూరు పశు వైద్య కేంద్రం

- వర్షాలకు రక్షణ కరువు
- భయంతో సిబ్బంది విధులు
- మరమ్మతుల కోసం ఎదురుచూపు



కూలే స్థితిలో ఉన్న పశు వైద్య కేంద్రం



భవనం స్లాబ్ బీటలువారి ఊడుతున్న పెచ్చులు



వర్షాలకు గోడలు నాని పాడైన మందులు, సామగ్రి

కొయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డౌనూరు పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరి ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. 25 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం స్లాబ్ పెచ్చులు ఊడి గోడలు బీటలు వారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరుచేరి మందులు తడిసిపోయి పనికిరాకుండా పోయాయని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేశారు. వ్యాక్సిన్లు భద్రపరిచే ఫ్రిజ్ పాడైపోయింది. ఈ భవనంలో విధులను భయంతో కొనసాగించాల్సి వస్తోందని ఓఎస్ టి. సత్యనారాయణ వాపోయారు. ఈ భవన మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. సుమారు 50 గ్రామాలకు చెందిన పశు గణానికి వైద్య సేవలందించేందుకు వీలుగా ఉన్న ఈ కేంద్రంపై అధికారులు ఇకనైనా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



పంచెకట్టుతో పండుగలో చిన్నారులు



సామూహిక స్నానాల ఘట్టం

ఘనంగా దీపావళి పంచెకట్టు పండుగ

- గిరిజన గ్రామాల్లో సందడి
- చిన్నారులకు పసుపునీటి స్నానాలు

ముంచంగిపుట్టు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట, దారెల, కించాయిపుట్టు గ్రామాల్లో దీపావళి పురస్కరించుకుని అనురాధ నక్షత్రంలో ఆదివారం గిరిజనులు పంచెకట్టు, సామూహిక స్నానాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 8 నుంచి 10 సంవత్సరాల చిన్నారులను గ్రామ చావిడి వద్దకు తీసుకువచ్చి పంచెకట్టి, మామిడి తోరణాలను కిరీటాలుగా అలంకరించారు. బిందెలతో తీసుకువచ్చిన నీటిలో పసుపు, చేదు ఆనపకాయను కలిపి పూలు, అక్షింతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులను గునపాలపై కూర్చోబెట్టి ధూప దీపాలతో హారతి ఇచ్చారు. పసుపు నీటితో చిన్నారులకు స్నానాలు చేయించారు. అనంతరం గిరిజనులు ఆ నీటిని జల్లుకున్నారు. చిన్నారులకు తెల్లటి వస్త్రాలను ధరించారు. ఈ పంచెకట్టు వేడుకను చూసేందుకు పరిసరాల గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారులకు దోషాల నివారణ జరిగి, మంచి జరుగుతుందని ఏటా ఈ పంచెకట్టు పండుగను నిర్వహిస్తామని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. అనంతరం గ్రామాల్లో అందరూ సహపంక్తి భోజనాలను చేశారు. డప్పు వాయిద్యాల నడుమ థింసా నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలకంఠం, శంకర్‌రరావు, నాగేశ్వరరావు, బాలమురళి, సదానందం, గణపతి, మన్మదరావు, ఈశ్వరరరావు, మత్స్యరాజు, లోహితాస్, తిరుపతిరావు, ఆనందరావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించి సమస్యలు వివరిస్తున్న గిడ్డి ఈశ్వరి (ఫైల్)

పాడేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవో 3 రద్దుతో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు జరుగుతున్న నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శనివారం విశాఖలో టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశమైన అనంతరం ఆమె గిరిజన ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా జీవో3 రద్దుతో గిరిజనులు తీవ్రంగానష్టపోతున్నారని, ఈ నేపథ్యంలో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగాలను శతశాతం గిరిజనులతోనే భర్తీ చేయాలని కోరా రు. అలాగే ఈ ఏడాది భారీ వర్షాలకు చింతపల్లి, జీకేవీధి, సీలేరు ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలను బాగు చేయించాలని, గిరిజన రైతుల ప్రత్యామ్నాయ పంట సాగుకు మరింతగా ప్రోత్సాహించాలని ఈశ్వరి సీఎం ను అభ్యర్థించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ



సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, తదితరులు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్, పాడేరు డివిజన్ జంగమ సేవా సంఘం అధ్యక్షుడు శివరాత్రిశ్రీనివాస్ కుమార్ ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న శ్రీనివాస్ కుమార్‌ను అభినందించారు. అలాగే, పేదలు, సాధువులకు అన్నదానం చేయడం ఆనందదాయకమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను ఆయన చేపట్టాలని కోరారు. అనంతరం అధ్యాపకులు విగ్రహ దాత శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన ట్రస్టు ప్రతినిధులు రమణ, కొండలరావు, ముకుందరావు, దేముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం స్థానిక మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప, శివ మాలధారులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం ఎదుట అరకిలో మీటరు మేర బారులు తీరారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో వంటలు చేసుకుని బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలను వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

బక్కులపనుకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఉషారాణి

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడేరులో శ్మశాన వాటిక మీదుగా బక్కులపనుకు వెళ్లే రహదారికి పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. పాడేరు మెయిన్ రోడ్డు నుంచి శ్మశాన వాటికకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు వివరించడంతో ఆమె సుమారు రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఈసీసీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే, శ్మశాన వాటిక ప్రహరీకి మరమ్మతులు చేపట్టి గేటు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు గోపాలకృష్ణ(అబ్బాస్), వరలక్ష్మి, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, కారు యూనియన్ అధ్యక్షుడు నాయుడు, కాంట్రాక్టర్ నూకరాజు, గ్రామ పెద్దలు స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి: ఎంపీపీ

ముంచంగిపుట్టు: గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు ఎంపీపీ ఎ.సీతమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని కిలగాడ పంచాయతీ చెరువుపాకల గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి నిధులు రూ. 5లక్షలు వెచ్చించి, 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణాలపై చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, వార్డు మెంబర్ కృష్ణారావు, వైసీపీ నేత జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ఆలయం ముస్తాబు



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ పురాతన శైవక్షేత్రంగా పేరుగాంచిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసోత్సవాలకు ముస్తాబయింది. గత వారం రోజుల నుంచి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో ఆలయ ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రతినిధులు, భక్త బృందం, ప్రసాద కమిటీ ప్రతినిధులు ఆలయ అలంకరణలో నిమగ్నమయ్యారు. మొదటి సోమవారం నాటికి ఆలయానికి రంగులతో పాటు విద్యుత్ అలంకరణలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు మాట్లాడుతూ ఆలయంలో నెల రోజులు పాటు కార్తీక ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. అదే విధంగా ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, సీహెచ్.రమాదేవి, దేశిది బాబూరావు, వంతినిబ రాజుబాబు, యువీ.రత్నం, బీవీఎస్.ముకుందరావు, సిద్ధినాతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో సూత్రధారులను అరెస్టు చేస్తాం

డీఎస్పీ మోహన్


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో సూత్రధారులను కూడా అరెస్టు చేస్తామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ తెలిపారు. నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో డీఎస్పీ మాట్లాడుతూ గతంలో గంజాయి కేసులలో పట్టుబడ్డవారిని మాత్రమే అరెస్టు చేసేవారమని, ఇకపై గంజాయి కేసులలో సూత్రధారులను కూడా గుర్తించి అరెస్టు చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు గంజాయి కేసులలో పరారీలో ఉన్నవారిని గుర్తించి 24 మందిని అరెస్టు చేశామన్నారు. తమ పరిధిలో గంజాయి రవాణాను అరికట్టడానికి కృష్ణాదేవిపేట, భీమవరం, యర్రవరంలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, లైవ్ కెమెరాలు కూడా పెట్టామని చెప్పారు. అలాగే గ్రామాలలో నాటుసారా అరికట్టడానికి ప్రజల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. ఇటీవల సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మేసేజ్‌లు వస్తే లింక్ చేసి మోసపోవద్దని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.భీమరాజు పాల్గొన్నారు.

వరిలో కేళీలపై రైతులు ఆందోళన


గుమ్మిడిగొండలో ఆర్‌జేఎల్ రకం సాగులో కేళీలు

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాతవరం, గుమ్మిడిగొండ తదితర గ్రామాలలో ఆర్‌జేఎల్ వరి సాగు చేస్తున్న రైతులు పంట పొలాల్లో కేళీలు ఎక్కువగా ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో రైతుభరోసా కేంద్రాలలో ఎక్కువమంది ఆర్‌జేఎల్ రకం వరి విత్తనాలు తీసుకుని వరి నారు వేశారు. ఆర్‌జేఎల్ వరి ద్వారా వచ్చే బియ్యం తినటానికి బాగుంటాయని, అమ్మకోవడానికి ఎక్కువ ధర వస్తుందన్న భావంతో ఈ రకం పంటను వేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌జేఎల్ వరి పంట పొట్ట దశకు వచ్చే సమయంలో ఎక్కువగా కేళీలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుభరోసా కేంద్రాలలో అధికారులు సరఫరా చేసిన నాసిరకం విత్తనాలతో తాము మోసపోయామని వారు వాపోయారు. వ్యవసాధికారులు ముందుచూపు లేకుండా కేళీలు ఉన్న వరి విత్తనాలు సరాఫరా చేయడం దారుణమని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో యోగాకు మరింత గుర్తింపు తెస్తా

యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సతీశ్


సతీశ్‌ను సత్కరిస్తున్న పతంజలి కేంద్రం సభ్యులు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యోగా క్రీడకు మరింత గుర్తింపు తీసుకువస్తానని యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.సతీశ్ తెలిపారు. స్థానిక పతంజలి యోగా కేంద్రం సభ్యులు సతీశ్‌ను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన తనకు అసోసియేషన్ రాష్ట్ర సారథ్య బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగా క్రీడను ప్రోత్సహించి మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పతంజలి యోగా కేంద్రం సభ్యులు భోగవిల్లి గణేష్, రెడ్డి అప్పారావు, రవితేజ, ఉప్పల వెంకటేశ్ పాల్గొన్నారు.

జైతవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వం తీసుకున్న టీడీపీ నాయకులు

చీడికాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరం గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైతవరం ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు దోకల అక్కునాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైల వెంకటరమణ, నాయకులు రెడ్డి కాశీవిశ్వనాథం, కొనగల్ల శ్రీనివాసరావు, రెడ్డి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

పంతులబాబు విగ్రహం ఊరేగింపు


పుత్తడిగైరంపేటలో పంతులబాబు విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరామపురం గ్రామంలో ప్రసిద్ధి చెందిన పాకలపాడు పంతులుబాబు గురూజీ విగ్రహాన్ని కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఆదివారం పలుగ్రామాల్లో ఊరేగించారు. పుత్తడిగైరంపేట, పెసరాడ, కంఠారం, శుద్ధలపాలెం గ్రామాల్లో ఊరేగింపు సాగింది. కార్తీక మాసం నెల రోజులూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ సభ్యుడు పత్తి రమణ తెలిపారు

అమ్మవాసవి సంఘం సేవలు అభినందనీయం


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమ్మవాసవి సంఘం నిరుపేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షురాలు ఇటంసెట్టి అక్కయ్యమ్మ ఆధ్వర్యంలో ఆదివారం వితంతువులు, మహిళల చీరలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ఈ సంఘం పేదలకు ఎనలేని సేవలు అందించిందని చెప్పారు. అనంతరం పేదలకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత అపిరెడ్డి మాణిక్యం, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వీరసూర్య చంద్ర, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు బుల్లిదొర పాల్గొన్నారు.

స్వయంభూ గౌరీశ్వరాలయ పుష్కరిణికి మోక్షం

- సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే నిర్ణయం
- అభివృద్ధి పనులకు రూ.70 లక్షలు మంజూరు



దుర్గంధపూరితంగా తయారైన స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి ఇదే...

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రం స్వయంభూ గౌరీశ్వరాలయ పుష్కరిణి అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి పొందిన ప్రముఖ శైవక్షేత్రమైన స్వయంభూ గౌరీశ్వరాలయానికి ఎంతో మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. కార్తీక మాసంలో ఈ ఆలయానికి వచ్చే భక్తులు సంఖ్య చాలా ఎక్కువ. అంతటి ప్రముఖమైన ఈ ఆలయం పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడంతో పాటు కార్తీక దీపాలు కూడా వదిలేవారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఈ పుష్కరిణిలోనే చక్ర స్నానం, ఇతరత్రా భక్తి కార్యక్రమాలు నిర్వహించేవారు. అలాంటి ఈ పుష్కరిణిని ఐదేళ్లుగా పట్టించుకునేవారు లేకపోవడంతో మురికి కూపంగా మారిపోయింది. పరిసరాల్లోని ఇళ్లలో వాడుకనీరు, బురదనీరు ఈ పుష్కరిణిలోకి విడిచిపెడుతుండడంతో చెత్త చెరువులా మారిపోయింది. దీనికితోడు ఈ పుష్కరిణిలోనే గేదెలను కూడా విడచిపెట్టడం, వాటిని ఇక్కడే కడుగుతుండంతో పుష్కరిణి దుర్గంధభరితంగా తయారైంది. దీన్ని ఆలయ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, తామరతూడులతో నిండిపోయి కనీసం అడుగుపెట్టలేని విధంగా మారిపోయింది. కొందరు ఈ చెరువును చెత్తపారబోసే కేంద్రంగా కూడా మార్చివేశారు. ఈ పుష్కరిణి పరిస్థితిని చూసి ఆలయానికి వచ్చే భక్తులు ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఈ నేపథ్యంలో పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో పుష్కరిణి చుట్టూ ఘాట్‌లు నిర్మించడంతో పాటు చెరువు అడుగు భాగంలో కాంక్రీటు నిర్మాణం, బోర్లు తవ్వించి ఓ పవిత్రమైన ఘాట్‌లా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. దీనికితోడు బయట నుంచి పుష్కరిణిలోని మురుగునీరు రాకుండా తీర్చిదిద్దనున్నారు. అలాగే ఆలయం పరిసరాలకు ఆనుకుని భక్తుల రాకపోకలకు వీలుగా ప్రత్యేకంగా రహదారికి కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. మొత్తమ్మీద ఎంతో కాలంగా నిరాదరణకు గురైన స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి అభివృద్ధికి అడుగులు పడడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీపురం రోడ్డులో ట్రాఫిక్ పద్మవ్యూహం

- రహదారి పక్కనే దుకాణాల ఏర్పాటు
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- చోడవరం ప్రజలు, వాహన చోదకుల పాట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



దుకాణాల ఎదుట ఇష్టారాజ్యంగా నిలిపివేసిన వాహనాలతో గందరగోళంగా ఉన్న లక్ష్మీపురం రహదారి

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. ఇది ఓ రకంగా వాహన చోదకులు, స్థానిక ప్రజలకు సంకటంగా మారింది. ప్రధాన రహదారిలో లక్ష్మీపురం ఆర్చి నుంచి చలపతి స్కూల్ వరకూ రహదారి వెంబడి దుకాణాల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో తరచూ వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇదే రూటులో పలు ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు స్థానికంగా కాలనీలు ఉన్నాయి. వీరందరికీ ఇదే ప్రధాన మార్గం. అయితే లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి ఆర్చి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు రోడ్డుపైకి రావడంతో పాటు రోడ్డుకు ఆనుకుని షెడ్లు దించడంతో వినియోగదారులు తమ వాహనాలను అక్కడే నిలిపివేస్తున్నారు. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించే వారికి దారి లేక తరచూ ఇబ్బందులు పడుతున్నారు. తమ దుకాణాల ముందు నిలిపే వాహనాల విషయంలో దుకాణదారులు సైతం కనీసం పట్టించుకోవడం లేదు. సరికదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెడుతుండడంతో మహిళలు, పిల్లలు, విద్యార్థులకు కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ రహదారిలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పంచాయతీ అధికారులతో పాటు పోలీసులు కూడా చొరవచూపాలని, తమ ఇబ్బందులు తీర్చాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

రోలుగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనాలు ఎక్కువగా సంచరించే ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని గ్రామస్థులు కొట్టి సంజీవరావు, మరిసా నరసింగరావు, మడ్డు వెంకునాయుడు, బొండల ప్రసాద్, కొట్టి పైడియ్యనాయుడు, కొట్టె ప్రసాద్, మోపాడ పైడియ్యనాయుడు, ఒనుం బుజ్జి, కొట్టె భాస్కరరావు తదితరులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వందలాది మంది ప్రజలు తిరిగే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. దీనివల్ల మెయిన్ రోడ్డులో రాకపోకలకు సాగించే వాహన చోదకులు, మహిళలు, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వారు చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మద్యం దుకాణాన్ని తక్షణమే ఎత్తివేయాలని, ఊరుకు దూరంగా పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు


భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు

మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు. న్యాయవాదులు శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోదులు ఆలయానికి వచ్చిన భక్తుకు ఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా చినబాబు


చినబాబు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా మెట్టపాలెంకు చెందిన కచ్చాల చినబాబును నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చినబాబు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు ఎం.సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలకు

గొలుగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని గొలుగొండ శాఖా గ్రంథాలయాధికారి రాజుబాబు చెప్పారు. మండల కేంద్రంలోని శాఖా గ్రాంథాలయంలో ఆదివారం చదవడం-రాయడం-ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలను చదుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.


గ్రంథాలయంలో పుస్తకాలు, పేపర్లు చదువుతున్న విద్యార్థులు




సుపథ పోటీలకు హాజరైన విద్యార్థులు... విజేతలకు బహుమతులు అందిస్తున్న యూవీఎస్.రాజు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు

సుపథ పోటీలకు విశేష స్పందన

25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థుల హాజరు

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సుపథ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా పోటీలకు దేవరాపల్లి, వేపాడ తదితర మండలాలకు చెందిన 25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్లోక పఠనం, పద్యపఠనం, గేయాలు, వ్యాసరచన, వేద పఠనం, తెలుగు నేర్చుకుందాం, తెలుగు తెలుసుకుందాం, శ్రీకృష్ణ చరితామృతం, క్విజ్, వ్యాచరచన పోటీల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు మాట్లాడుతూ మాతృ భాషా పరిరక్షణకు అందరూ కృషిచేయాలని కోరారు. సుపథ రూపకర్త యూవీఎస్.రాజు మాట్లాడుతూ ప్రస్తుత తరానికి మానవతా విలువలు నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుపథ సభ్యులు కె.శ్రీనివాసు, బీవీ.దేముళ్లు, ఉదయ్‌కుమార్, డి.దేముడు, సూర్యనారాయణ, వై.త్రినాథ్, ఇట్లా నారాయణ రావు, చిన్నంనాయుడు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంతువీధిలో కుంగిన సీసీ రోడ్డు

- వాహన రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాల బారిన ప్రజలు..
- పట్టని అధికారులు


బొంతువీధిలో కుంగిన సీసీ రోడ్డు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని బొంతువీధిలో సీసీ రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవాంతం ఏర్పడుతోంది. ఫలితంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. 22వ వార్డులోని వెంకునాయుడుపేట ప్రజలు ఇందిరా మార్కెట్, అబీద్ సెంటర్ రావాలంటే ఈ రోడ్డునే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. బొంతువీధి కాలనీ వాసులు కూడా అబీద్ సెంటర్ మెయిన్ రోడ్డుకు రావాలంటే ఈ రోడ్డు ఒక్కటే దిక్కు. సీసీ రోడ్డు కుంగిపోవడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఏడేళ్ల క్రితం టీడీపీ పాలకవర్గంలో ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్డు మధ్యలో తవ్వేశారు. డ్రైనేజీ మీద సిమ్మెంటు పలకలు అమర్చారు. దీని వల్ల రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పక్కనే పెద్ద డ్రైనేజీ ఉంది. ఈ సమస్యకు తోడు తాజాగా సీసీ రోడ్డు కుంగిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

దత్తాశ్రమంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ


సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం ఉత్తర వాహిని తీరంలో ఉన్న దత్తాశ్రమంలో జ్యోతిష్య సిద్ధాంతి గుమ్మడు ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ వల్లి దేవసేన సమమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం విశేష పూజలో పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశిష్ట పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు ప్రసాద్ తెలిపారు. అనంతరం వందలాది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

సీఆర్టీల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును కోరారు. ఆదివారం అతన్ని కలిసి సమస్యలపై లిఖితపూర్వంగా వినతిపత్రం అందించారు. సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, గిరిజన ప్రాంతాలలో ఉన్న ఆశ్రమ, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పీఆర్‌టీయూ కన్వీనర్ డీజీనాథ్, పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అప్పారావు, నాయకులు రామకృష్ణ, చిన్నారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై సచివాలయాల్లో వినతులు

- ఏపీ రైతు సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం అన్ని సచివాలయాల్లో వినతులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలక ప్రాజెక్టులతో పాటు ఇతర ఇరిగేషన్ వనరులను కూడా నిర్లక్ష్యం చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. అన్ని సచివాలయాల పరిధిలోని సాగునీటి వనరులను ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా సచివాలయాల్లో వినతులు అందచేయాలని ఆయన కోరారు.

8న భగవద్గీత శ్లోకాల పోటీలు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రేమసమాజంలో టీడీపీ సహకారంతో ఈ నెల 8న విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్టు సంగీత పీఠం నిర్వాహకుడు రామయ్యరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో 18 సంవత్సరాల లోపు విద్యార్థులంతా పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.

నక్కపల్లి గురుకులం నేమ్ బోర్డ్ మార్పు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవేకు ఆనుకుని వున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల/కళాశాల (బాలికలు) మెయిన్ ఎంట్రన్స్ వద్ద వున్న నేమ్ బోర్డును ఎట్టకేలకు మార్పు చేశారు. గురుకులం భవనంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం అనే నేమ్ బోర్డు వుండగా, గత కొన్నేళ్ల నుంచి ప్రవేశ ద్వారం వద్ద బాలయోగి గురుకులం అనే పేరుతో బోర్డు కన్పించేది. ఒక విద్యాసంస్థకు రెండు పేర్లు ఏమిటని పలువురు ఆశ్చర్యచకితులయ్యారు. ఈ విషయాన్ని శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ఏది నిజం ? శీర్షికను ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తక్షణమే సరైన నేమ్‌బోర్డు బయట ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో బయట కూడా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేమ్‌బోర్డును ఆదివారం ఏర్పాటు చేశారు.



గురుకులం ప్రవేశ ద్వారం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు

తొలుత న్యాయం చేయండి

▸▸ తర్వాతే స్టీల్‌ప్లాంట్ పెట్టండి

▸▸ కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులందరికీ పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా స్టీల్‌ప్లాంట్ ఎలా ఏర్పాటు చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చందనాడ తుఫాన్ భవనం వద్ద నిర్వాసిత రైతులతో కలిపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములిచ్చిన రైతులు, గృహాలు కోల్పోయిన వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారో ఇప్పటికీ ప్రకటించలేదన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించకుండా ఉక్కు పరిశ్రమను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘ ప్రతినిధులు ఎం.సత్యనారాయణ, అప్పలస్వామి, గోవిందరావు, చిన్న, అప్పారావు, రమేశ్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగులకు అన్యాయం

▸▸ దివ్యాంగుల సమైక్య జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి

ఎస్.రాయవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగులకు అన్యాయం జరిగిందని దివ్యాంగుల సమైక్య జిల్లా అధ్యక్షురాలు జి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ దివ్యాంగుల సమైక్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో దివ్యాంగుల గురించి సర్వే చేయించి, ఐదు నుంచి పది మందితో దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేసిందన్నారు. వాటి ద్వారా మండల దివ్యాంగుల సమైక్య, జిల్లా సమైక్యలను ఏర్పాటు చేసి, దాని ద్వారా ప్రభుత్వ పథకాలను అమలు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దివ్యాంగులను చిన్నచూపు చూస్తూ పథకాల గురించి తెలియకుండా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి మరలా పూర్వ విధానాన్ని అమలు చేయాలని వరలక్ష్మి కోరారు.

నేడు ఆరు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేతకు సోమవారం ఉదయం ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక రాజుగారిబీడు, బీడీఓ లేఅవుట్, పీఎస్ఆర్.నగర్, కరణంగారివీధి, కుమ్మరివీధి, పెద పీర్లుపంజావీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాలలో ఓవ్యక్తి నుంచి యాభై మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వర రావు తెలిపారు. మండలంలోని తగరంపూడికి చెందిన సమ్మంగి నాగరాజు అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన ఇంటివద్ద మద్యం అమ్మకాలు చేసేందుకు అనకాపల్లి మద్యం దుకాణంలో 50మద్యం బాటిళ్లు కొనుగోలు చేశాడు. వాటిని బ్యాగులో పెట్టి వెళుతుండగా, అనుమానం వచ్చి తుమ్మపాలలో తనిఖీ చేశామన్నారు. మద్యం బాటిళ్లు పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

'జీడిమామిడి తోటలకు బీమాను సద్వినియోగం చేసుకోండి'

సబ్బవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీడిమామిడి తోటలకు సంబంధించిన బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఉద్యాన శాఖాధికారిణి కిరణ్మయి ఒక ప్రటనలో కోరారు. ఈనెల 15లోగా రైతులు ప్రీమియం సొమ్ము చెల్లించాలని సూచించారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా..?

- అత్యంత దారుణంగా మార్టూరు- మాకవరం రహదారి
- భారీ గుంతలు, దుమ్ము...ధూళితో దర్శనం
- ప్రయాణాలకు అవస్థలు పడుతున్న వాహనదారులు





దుమ్ము, ధూళితో ఉన్న మార్టూరు- మాకవరం రోడ్డు



ఎక్కడికక్కడ గుంతల మయంగా ఉన్న దృశ్యం

తుమ్మపాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు నుంచి మాకవరానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా భారీ గోతులు ఏర్పడడంతో పాటు కిలోమీటరు మేర తారు లేయరు లేచిపోయి అస్తవ్యస్తంగా దర్శనమిస్తుంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది.

నిత్యం రద్దీ

మార్టూరు- మాకవరం రహదారి మీదుగా చినమాకవరం, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం, చేనుల అగ్రహారం, చింతనిప్పుల అగ్రహారం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అనకాపల్లి పట్టణానికి చేరుకోవడానికి ఈ రోడ్డు ప్రధానమైనది. దాదాపు ఐదు కిలోమీటర్లు మేర రోడ్డు దారుణంగా తయారైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా ఛిద్రమై తారు లేయరు లేచిపోవడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ఫలితంగా పలువురు వాహనదారులు గాయాలపాలై ఆసుపత్రుల్లోకి చేరుతున్నారు. దీనికితోడు చినుకుపడిందంటే ఈ రోడ్డు బురదమయంగా తయారవుతోంది. అడుగు తీసి అడుగు వేయలేనంత దారుణంగా మారిపోతుంది.

భారీ లోడుతో క్వారీ, క్రషర్ల వాహనాల రాకపోకలు

మార్టూరు- మాకవరం పరిధిలో క్వారీ, క్రషర్లు అధికంగా ఉన్నాయి. దీంతో భారీ వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో ఆయా వాహనాల వెనుక వస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. కళ్లలో దుమ్ము, ధూళి పడి అవస్థలు పడుతున్నారు. క్వారీ, క్రషర్ల నుంచి భారీ లోడులతో వాహనాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రోడ్డు మరింత ఛిద్రమైందని అంటున్నారు.

రాత్రి వేళల్లో ప్రయాణం మరీ దారుణం

ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో ప్రయాణమంటే పలువురు హడలిపోతున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చీకట్లో ఎక్కడ రోడ్డు ఉందో.. ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాల బారినపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులంతా కోరుతున్నారు.



సబ్బవరం మండలం పెదయాతపాలెంలో గల గౌరీపరమేశ్వరుల సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలు

కార్తీక దామోదరుడి పూజలకు ఏర్పాట్లు

- నేడు వేకువజాము నుంచి భక్తుల కోలాహలం



సుందరంగా తీర్చిదిద్దిన అనకాపల్లి వేల్పులవీధిలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

అనకాపల్లి టౌన్/సబ్బవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా ఈ ప్రాంతంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు. దీంతో అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర తదితర ఆలయాల్లో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే, మంగళవారం జరిగే నాగుల చవితి వేడుకలకు దిబ్బవీధిలోని నాగేంద్రస్వామి ఆలయం, ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ రెండుచోట్ల భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. దిబ్బవీధి నాగేంద్రుని ఆలయం వద్ద ఒకటో తేదీ నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చవితి రోజున ఆలయం వద్ద పుట్టలో పాలు పోయడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయాన్ని కూడా అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం రాత్రికి భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, సబ్బవరం మండలంలోని ఆరిపాక శివారు పెదయాతపాలెంలో గల గౌరీ పరమేశ్వరుల ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం కార్తీక మాసోత్సవాలకు ముస్తాబైంది. పర్యాటకంగా ప్రసిద్ధి చెందడంతో నిత్యం ఈ ఆలయానికి భక్తులు వస్తూనే ఉన్నారు. ఆలయం చుట్టూ కొబ్బరి తోటతో పాటు పచ్చదనం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గౌరీపరమేశ్వర్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి.



విద్యుద్దీప కాంతులలో దిబ్బవీధి నాగేంద్రుని ఆలయం

శారదా నది ప్రాంత అభివృద్ధికి చర్యలు

- అన్నమయ్య పార్కు పునర్నిర్మాణం ▸ పాత బ్రిడ్జికి ట్యాంక్ బండ్ తరహా సొబగులు ▸ 'స్వచ్ఛతే సేవ'లో ఎమ్మెల్యే కొణతాల



స్వచ్ఛతే సేవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శారదా నది ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. గ్రీన్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం నది వద్ద స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తాచెదారంతో నిండిన ఘాట్‌ను క్లబ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. శారదానది ఒడ్డున ఉన్న అన్నమయ్య పార్కును పునర్నిర్మాణం చేయనున్నామన్నారు. పాత బ్రిడ్జిని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో వినోద కార్యక్రమాల కోసం ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. శారదానది ఘాట్ నుంచి అన్నమయ్య పార్కుకు కనెక్టివింగ్ రోడ్డును ఏర్పాటు చేసి ఆ ప్రాంతమంతటిని సుందరంగా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కొత్తూరు పంచాయతీ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, కశింకోట వివేకానంద కళాశాల విద్యార్థులు, ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు, గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, యల్లపు సూరిఅప్పారావు, బీరా వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఘాట్‌ను శుభ్రం చేస్తున్న గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం



ప్రిన్సిపాల్ రాజేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఇక్కడి బీఆర్‌టీ కాలనీ, రామాపురం గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్టర్ డాక్టర్ విలియం క్యారీ ముఖ్య అతిథిగా హాజరై పలు ఫార్మసీ కళాశాలల విద్యార్థులను ప్రతిభ ఆధారంగా గుర్తించి సత్కరించారు. ప్రతి ఏటా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టుల సంఘం ప్రతినిధులు రత్నాల ప్రకాశరావు, చరపాక హేమంత్, బొబ్బిలికి చెందిన భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొణతాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండ : మాజీ ఎమ్మెల్యే బాబ్జీ



నారపాడులో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 3 : కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని నల్లరేగులపాలెం, నారపాడు, తవ్వావానిపాలెం గ్రామాల్లో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వం పొందేవారికి ప్రమాద బీమాతో పాటు అండగా నిలిచేందుకు మరికొన్ని కార్యక్రమాలకు చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారన్నారు. యువతీ, యువకులకు అధిక సంఖ్యలో సభ్యత్వం ఇవ్వాలని శ్రేణులకు సూచించారు. పెందుర్తి నియోజకవర్గానికి 55 వేలు సభ్యత్వాలు లక్ష్యంగా ఇచ్చారన్నారు. లక్ష్యాన్ని మించి చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. రానున్న ఐదేళ్లలో అమరావతి, పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులతో పాటు విశాఖ మెట్రో ప్రాజెక్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని మండలాలను కలుపుతూ రింగురోడ్డు రూపకల్పనకు కృషి జరుగుతుందని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. నాటి సీఎం ఎన్ని తప్పులు చేయాలో అన్నీ చేసి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరణికాన బాబూరావు, రామకృష్ణరాజు, గండి దేముడు, రొంగలి శ్రీను, కోరుపోలు గోవింద, గొర్లి చైతన్య, బోకం అర్జునుడు, బాలకృష్ణ, శ్రీరామూర్తి, గండి నారాయణబాబు, పంచాడ శ్రీను, పైల రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వుషూ పోటీలకు 'గ్లోబల్' విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సీఈవో నిశాంత్

పరవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వుషూ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ డైరెక్టర్ మధుబాబు ఆదివారం తెలిపారు. శ్రీకాకుళంలో త్వరలో నిర్వహించనున్న ఈ పోటీలకు విద్యార్థులు బి.విక్టర్, రాహుల్‌మిస్త్రీ, పి.అభినవ్, వి.సంజయ్, సీహెచ్.సహిద్, క్రిష్‌దేవని హాజరు కానున్నారన్నారు. సదరు విద్యార్థులను పాఠశాల సీఈవో కె.నిశాంత్, కోచ్ రమ్య అభినందించారు.

'బీజేపీ బలోపేతం అందరి బాధ్యత'



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వి.రమేష్, అనకాపల్లి అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, అర్బన్ సెల్ జిల్లా కన్వీనర్ కాసర్ల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నేడు సమస్యలపై వీఆర్ఏల ఆందోళన'

సబ్బవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు నీటిపల్లి గంగాధర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వలే తమకు పే స్కేల్ అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా మోపిన విధులను రద్దు చేయాలని కోరారు. వీఆర్‌వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్లు తదితర ఖాళీ పోస్టులలో అర్హులైన వీఆర్ఏలతో 70 శాతం పోస్టులు భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈ డిమాండ్లపై ఆందోళన చేపట్టనున్నామన్నారు.

'మెట్రోకెమ్'లో ప్రమాదంపై విచారణ చేపట్టాలి

పరవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ (ఏపీఐ) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం ఇక్కడ డిమాండ్ చేశారు. ప్రమాదం కారణంగా పరిసర పరిశ్రమలకు చెందిన కార్మికులు భయాందోళనకు గురయ్యారన్నారు. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఏం జరిగిందోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో నెలకొందన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎప్పటికప్పుడు భద్రతా ఆడిట్ నిర్వహించి, కార్మికుల భద్రతకు ఢోకా లేకుండా చూడాలని గనిశెట్టి డిమాండ్ చేశారు

- సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్

అనకాపల్లి టౌన్ : పరవాడ ఫార్మా సిటీలోని మెట్రోకెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఇక్కడ డిమాండ్ చేశారు. కంపెనీలో శనివారం రాత్రి రియాక్టర్ వద్ద సంభవించిన పేలుడు వల్ల కార్మికులు, చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారన్నారు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.

'ఉమ్మడి జిల్లాలో సమస్యలను సీఎం విస్మరించారు'

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని సమస్యలను విస్మరించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా పెట్టుబడులు, సంపద సృష్టి వంటి వాటిపై ప్రసంగించారని వివరించారు. రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చే సుజల స్రవంతి ప్రాజెక్టు గురించి ప్రస్తావన తీసుకురాలేదని వాపోయారు.

విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు ఆరోపణ
- తగ్గించిన పాల సేకరణ ధరను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలి
- మాడుగుల ఎమ్మెల్యే 'బండారు'కు వెన్నెలపాలెంలో వినతి



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌వీ నాయుడు, నాయనబాబు

పరవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీ నాయుడు, కోశాధికారి గండి నాయనబాబు కోరారు. ఈ మేరకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని తన స్వగ్రామమైన మండలంలోని వెన్నెలపాలెంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల పాలుపోసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోయాయని ఆరోపించారు. గేదె పాలు లీటరుకు రూ.80, ఆవు పాలు లీటరు రూ.50 చొప్పున చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. సహకార చట్టాన్ని తుంగలోకి తొక్కి డెయిరీని నడుపుతున్న యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'స్కౌట్స్, గైడ్స్ శిక్షణతో ఉద్యోగావకాశాలు'



స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థినీ విద్యార్థులు

కశింకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో డే హైక్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధి కొణతాల రత్నకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందడం ద్వారా ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, శరీరక దారుఢ్యం, ధైర్య సాహసాలు, పొదుపు, ప్రకృతిని కాపాడడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో వంద మందికి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ స్కూలు ప్రతినిధులు పాల్గొన్నారు.

చింతపల్లి సీఐ రమేశ్ బదిలీ



చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రమేశ్‌ను బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు చింతపల్లిలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన రమేశ్‌ని విశాఖపట్నం సీటీ వీఆర్‌కి బదిలీ చేయగా, ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా సోషల్‌మీడియా సెల్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వినోద్ బాబుని నియమించారు. సోమవారం నూతన సీఐ విధుల్లో చేరనున్నారు.

9, 10 తేదీల్లో జీఎస్‌యూ శిక్షణ తరగతులు



పోస్టర్లను జీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఈ నెల 9, 10వ తేదీలలో జీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఆదివాసీ సమాజంపై అవగాహన కలిగిన వారితో నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతుల పోస్టర్లను ఆయన క్యాంప్ కార్యాలయంలో జీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న పోటీతత్వాన్ని తట్టుకోనేలక్ష్యం, ఆదివాసీ చట్టాలు, హక్కులు తదితర అంశాలను ఈ శిక్షణ తరగతుల్లో వివరిస్తారన్నారు. జిల్లాలోని గిరిజన యువతీ, యువకులు, నిరుద్యోగులు, ఆదివాసీలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు రామారావు దొర, కె.తెల్లబాబు,పి.సురేశ్‌కుమార్, బుడిదే మాధవరావు, కిరసాని కిశోర్, ఎం.బాబి, బి.అనీల్, పి.రాంబాబు, శేఖర్, శివ, భీమ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



డీఎస్పీ షహబాజ్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు కోరారు. ఆదివారం నూతనంగా డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షేక్ షహబాజ్ అహమ్మద్‌ను చింతపల్లి, జీకేవీధి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పర్యాటక సీజన్‌లో లంబసింగి, తాజంగి పంచాయతీల పరిధిలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లో చిరంజీవి, మొట్టడం బాలరాజు, మర్రి గురుమూర్తి, గెమ్మెలి సింహాద్రి, కొర్ర సుందరరావు, గుంటా జిన్ను, గెమ్మెలి కృష్ణారావు, వంతల రవి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలపై ఆదివాసీలు ఆసక్తి



సభ్యత్వాలు నమోదు చేసుకుంటున్న ఆదివాసీలు

చింతపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాల స్వీకరణకు ఆదివాసీలు ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం కిటుముల పంచాయతీ రాకోట, బౌడ గ్రామాల్లో 300 మందికి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో టీడీపీకి ప్రజామద్దతు పెరిగిందన్నారు. ఆదివాసీలు ఉత్సాహంగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి వ్యక్తికి రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో సభ్యత్వాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటరావు, నాయకులు రాధాకృష్ణ, కేశవరావు, అప్పలకొండ, భీమన్నపడాల్, బాలూదొర, బస్వన్నదొర, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

ముంచంగిపుట్టు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఈ నెల 5వ తేదీన ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని విశాఖ తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు. రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, ఫోన్ నెంబరు, తదితర వివరాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఉచిత భోజనం, రవాణా సదుపాయం ఉంటుందని చెప్పారు.



హుకుంపేటలో ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు



నిరుపయోగంగా రాళ్లగడ్డవద్ద ఉన్న డంపింగ్ కేంద్రం

డంపింగ్ యార్డును తలపిస్తున్న హుకుంపేట

- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- కాలువలు అధ్వానం.. దోమలు విజృంభణ
- ప్రబలుతున్న విష జ్వరాలు
- పట్టించుకోని పంచాయతీ

హుకుంపేట నవంబరు 3 ఆంధ్రజ్యోతి: మండలం కేంద్రమైన హుకుంపేట చెత్తాచెదారాలు, మురుగు నీటి కాలువలతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతోవ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. రాళ్లగెడ్డ సమీపంలో గతంలో నిర్మించిన డంపింగ్ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయినా పంచాయతీ అధికారులు కనీసం తొలగించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చెత్త, వ్యర్థాల వల్ల దుర్వాసన భరించలేకున్నామని పరిసర కుటుంబాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దోమలు వృద్ధితో మలేరియా, డెంగ్యు ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. గతంలో ప్రతి ఇంట్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నట్టు చెబుతున్నారు. రామాలయం వీధి రోడ్డు, అడ్డుమండలోని వైన్ షాప్ ఉన్న ప్రాంతం, మెయిన్ రోడ్డు చెత్త పేరుకుపోవడంతో అధికారులకు ఫిర్యాదుచేసినా చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంతో నమకంతో ఓట్లు వేసి గెలిపించిన నాయకులూ కనీసం పారిశుధ్యం కల్పనపై దృష్టి సారించలేదని వాపోతున్నారు.మండలంలోని 33 పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు ప్రతి రోజూ తమ అవసరాలకు ఇక్కడికి వస్తుంటారు. ఎక్కడ చూసినా చెత్త కనిపించటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం కల్పనపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ ఆటవిడుపు

పిల్లలతో కలిసి కొత్తపల్లి జలపాతం సందర్శన



జలపాతం వద్ద పిల్లలతో కలిసి స్నానాలు చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

జిల్లా పెద్దగా నిత్యం అధికారిక కార్యకలాపాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీబిజీ గా ఉండే కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం జి.మాడుగుల మండలంలోకి కొత్తపల్లి జలపాతం వద్దకు తమ పిల్లలతో కలిసి ఆటవిడుపుగా వెళ్లారు. తను జిల్లా కలెక్టర్ అనే భావన లేకుండా సాధారణ సందర్శకుడిలా జలపాతంలో చిన్నారులతో కలసి స్నానం చేశారు. అక్కడున్న వారిని ఆప్యాయంగా పలుకరించడం అందర్నీ విశేషంగా ఆకట్టుకుంది. కలెక్టర్ రావడం ఆనందంగా ఉందని కొత్తపల్లి జలపాతం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. - ఆంధ్రజ్యోతి/పాడేరు

మినుములూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలి



అరకు ఎంపీ తనూజారాణికి వినతిపత్రం అందిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు పీహెచ్‌సీలో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరుతూవైద్యాధికారి గోపాలకృష్ణ సిబ్బందితో కలిసి అరకు ఎంపీ గుమ్మ తనూజారాణికి వినతిపత్రం అందించారు. పాడేరులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. పీహెచ్‌సీలో పరిధిలో అన్ని కేడర్ల సిబ్బంది, ఆశ కార్యకర్తలు సుమారు 254 మంది విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సిబ్బందికి పీహెచ్‌సీలో నెలవారీ సమావేశాలు, శిక్షణలు జరపాల్సి ఉంటుందన్నారు. పీహెచ్‌సీలో సమావేశ మందిరం, తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఇబ్బందికి లోనవుతున్నట్టు వివరించారు. ఎంపీని కలిసిన వారిలో ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, పర్యవేక్షకులు పీవీ వరలక్ష్మి,సిబ్బంది శెట్టి నాగరాజు, కె.లక్ష్మణరావు, జేవీ.చలంపాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం: సీఐటీయూ

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికుల స్థితిగతులు, సమస్యలపై వివిధ సంఘాలు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రికి వివరించినట్టు చెప్పారు. కార్మికుల మధ్య కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విభజించి పాలించే రీతిలో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో కార్మికులు ఏకమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు బి. చిన్నయ్యపడాల్, ఉమామహేశ్వరరావు, ఎల్.సుందరరావు, బి.సన్నిబాబు, పోతురాజు, సత్యనారాయణలున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి



మాట్లాడుతున్న ముక్కలి కల్యాణి

గూడెంకొత్తవీధి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్నారు. పింఛన్ సొమ్ము పెంచిందన్నారు. మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. తాజాగా ఉచిత గ్యాస్ పథకం ప్రారంభించిందన్నారు. త్వరలో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తుందన్నారు. జనవరిలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు జారీ చేసేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 25వేల పక్కాగృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తికాని గృహా లకు సైతం నిధులు విడుదల చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్, నాయకులు రాజుబాబు, చిన్నబ్బాయ్యి, జోగిదొర పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై 15న ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

పాడేరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా నిరసన కార్యక్రమాలు తప్పవని జిల్లా యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలపై డీఎంహెచ్‌వో, జిల్లా కలెక్టర్ దృష్టికి వినతులు అందించినా నేటికి సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 15వ తేదీన జిల్లా కేంద్రం పాడేరులో చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని ఏఎన్ఎంలు విజయవంతం చేయాలన్నారు. రెండవ ఏఎన్ఎంలకు రూ. 22 వేలు జీతం చెల్లించాల్సి ఉండగా ఈ నెలలో కేవలం రూ. 600 మాత్రమే బ్యాంక్ అకౌంట్‌లో జమ కావడం విచారకమన్నారు. అధికారులు స్పందించి ఫేషియల్ హాజరు నుంచి ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని, ఇన్సెంటివ్, ఇంక్రిమెంట్‌ల చెల్లింపులు సక్రమంగా చేయాలని, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుష్ప, ముక్తమ్మ, కుమారి, భవాని, అంబిక, పార్వతి, వరలక్ష్మి, శెట్టి నాగరాజు, సీఐటీయూ నాయకులు చిన్నయ్యపడాల్, సుందరరావు, 11 మండలాల పరిధిలోని ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో డౌనూరు పశు వైద్య కేంద్రం

- వర్షాలకు రక్షణ కరువు
- భయంతో సిబ్బంది విధులు
- మరమ్మతుల కోసం ఎదురుచూపు



కూలే స్థితిలో ఉన్న పశు వైద్య కేంద్రం



భవనం స్లాబ్ బీటలువారి ఊడుతున్న పెచ్చులు



వర్షాలకు గోడలు నాని పాడైన మందులు, సామగ్రి

కొయ్యూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డౌనూరు పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరి ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. 25 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం స్లాబ్ పెచ్చులు ఊడి గోడలు బీటలు వారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరుచేరి మందులు తడిసిపోయి పనికిరాకుండా పోయాయని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేశారు. వ్యాక్సిన్లు భద్రపరిచే ఫ్రిజ్ పాడైపోయింది. ఈ భవనంలో విధులను భయంతో కొనసాగించాల్సి వస్తోందని ఓఎస్ టి. సత్యనారాయణ వాపోయారు. ఈ భవన మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. సుమారు 50 గ్రామాలకు చెందిన పశు గణానికి వైద్య సేవలందించేందుకు వీలుగా ఉన్న ఈ కేంద్రంపై అధికారులు ఇకనైనా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



పంచెకట్టుతో పండుగలో చిన్నారులు



సామూహిక స్నానాల ఘట్టం

ఘనంగా దీపావళి పంచెకట్టు పండుగ

- గిరిజన గ్రామాల్లో సందడి
- చిన్నారులకు పసుపునీటి స్నానాలు

ముంచంగిపుట్టు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుజనకోట, దారెల, కించాయిపుట్టు గ్రామాల్లో దీపావళి పురస్కరించుకుని అనురాధ నక్షత్రంలో ఆదివారం గిరిజనులు పంచెకట్టు, సామూహిక స్నానాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 8 నుంచి 10 సంవత్సరాల చిన్నారులను గ్రామ చావిడి వద్దకు తీసుకువచ్చి పంచెకట్టి, మామిడి తోరణాలను కిరీటాలుగా అలంకరించారు. బిందెలతో తీసుకువచ్చిన నీటిలో పసుపు, చేదు ఆనపకాయను కలిపి పూలు, అక్షింతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులను గునపాలపై కూర్చోబెట్టి ధూప దీపాలతో హారతి ఇచ్చారు. పసుపు నీటితో చిన్నారులకు స్నానాలు చేయించారు. అనంతరం గిరిజనులు ఆ నీటిని జల్లుకున్నారు. చిన్నారులకు తెల్లటి వస్త్రాలను ధరించారు. ఈ పంచెకట్టు వేడుకను చూసేందుకు పరిసరాల గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారులకు దోషాల నివారణ జరిగి, మంచి జరుగుతుందని ఏటా ఈ పంచెకట్టు పండుగను నిర్వహిస్తామని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. అనంతరం గ్రామాల్లో అందరూ సహపంక్తి భోజనాలను చేశారు. డప్పు వాయిద్యాల నడుమ థింసా నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలకంఠం, శంకర్‌రరావు, నాగేశ్వరరావు, బాలమురళి, సదానందం, గణపతి, మన్మధరావు, ఈశ్వరరరావు, మత్స్యరాజు, లోహితాస్, తిరుపతిరావు, ఆనందరావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించి సమస్యలు వివరిస్తున్న గిడ్డి ఈశ్వరి (ఫైల్)

పాడేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవో 3 రద్దుతో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు జరుగుతున్న నష్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శనివారం విశాఖలో టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశమైన అనంతరం ఆమె గిరిజన ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా జీవో3 రద్దుతో గిరిజనులు తీవ్రంగానష్టపోతున్నారని, ఈ నేపథ్యంలో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలను శతశాతం గిరిజనులతోనే భర్తీ చేయాలని కోరా రు. అలాగే ఈ ఏడాది భారీ వర్షాలకు చింతపల్లి, జీకేవీధి, సీలేరు ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలను బాగు చేయించాలని, గిరిజన రైతుల ప్రత్యామ్నాయ పంట సాగుకు మరింతగా ప్రోత్సాహించాలని ఈశ్వరి సీఎం ను అభ్యర్థించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ



సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, తదితరులు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్, పాడేరు డివిజన్ జంగమ సేవా సంఘం అధ్యక్షుడు శివరాత్రిశ్రీనివాస్ కుమార్ ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సరస్వతీ దేవి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న శ్రీనివాస్ కుమార్‌ను అభినందించారు. అలాగే, పేదలు, సాధువులకు అన్నదానం చేయడం ఆనందదాయకమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను ఆయన చేపట్టాలని కోరారు. అనంతరం అధ్యాపకులు విగ్రహ దాత శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన ట్రస్టు ప్రతినిధులు రమణ, కొండలరావు, ముకుందరావు, దేముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం స్థానిక మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప, శివ మాలధారులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం ఎదుట అరకిలో మీటరు మేర బారులు తీరారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో వంటలు చేసుకుని బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలను వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

బక్కులపనుకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఉషారాణి

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడేరులో శ్మశాన వాటిక మీదుగా బక్కులపనుకు వెళ్లే రహదారికి పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. పాడేరు మెయిన్ రోడ్డు నుంచి శ్మశాన వాటికకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు వివరించడంతో ఆమె సుమారు రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ఈసీసీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే, శ్మశాన వాటిక ప్రహరీకి మరమ్మతులు చేపట్టి గేటు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు గోపాలకృష్ణ(అబ్బాస్), వరలక్ష్మి, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, కారు యూనియన్ అధ్యక్షుడు నాయుడు, కాంట్రాక్టర్ నూకరాజు, గ్రామ పెద్దలు స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి: ఎంపీపీ

ముంచంగిపుట్టు: గిరి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు ఎంపీపీ ఎ.సీతమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని కిలగాడ పంచాయతీ చెరువుపాకల గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి నిధులు రూ. 5లక్షలు వెచ్చించి, 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణాలపై చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, వార్డు మెంబర్ కృష్ణారావు, వైసీపీ నేత జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ఆలయం ముస్తాబు



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

పాడేరురూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ పురాతన శైవక్షేత్రంగా పేరుగాంచిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసోత్సవాలకు ముస్తాబయింది. గత వారం రోజుల నుంచి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో ఆలయ ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రతినిధులు, భక్త బృందం, ప్రసాద కమిటీ ప్రతినిధులు ఆలయ అలంకరణలో నిమగ్నమయ్యారు. మొదటి సోమవారం నాటికి ఆలయానికి రంగులతో పాటు విద్యుత్ అలంకరణలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు మాట్లాడుతూ ఆలయంలో నెల రోజులు పాటు కార్తీక ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. అదే విధంగా ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, సీహెచ్.రమాదేవి, దేశిది బాబూరావు, వంతినిభ రాజుబాబు, యువీ.రత్నం, బీవీఎస్.ముకుందరావు, సిద్ధినాతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ గౌరీశ్వరాలయ పుష్కరిణికి మోక్షం

- సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే నిర్ణయం
- అభివృద్ధి పనులకు రూ.70 లక్షలు మంజూరు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రం స్వయంభూ గౌరీశ్వరాలయ పుష్కరిణి అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి పొందిన ప్రముఖ శైవక్షేత్రమైన స్వయంభూ గౌరీశ్వరాలయానికి ఎంతో మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. కార్తీక మాసంలో ఈ ఆలయానికి వచ్చే భక్తులు సంఖ్య చాలా ఎక్కువ. అంతటి ప్రముఖమైన ఈ ఆలయం పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడంతో పాటు కార్తీక దీపాలు కూడా వదిలేవారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి ఈ పుష్కరిణిలోనే చక్ర స్నానం, ఇతరత్రా భక్తి కార్యక్రమాలు నిర్వహించేవారు. అలాంటి ఈ పుష్కరిణిని ఐదేళ్లుగా పట్టించుకునేవారు లేకపోవడంతో మురికి కూపంగా మారిపోయింది. పరిసరాల్లోని ఇళ్లలో వాడుకనీరు, బురదనీరు ఈ పుష్కరిణిలోకి విడిచిపెడుతుండడంతో చెత్త చెరువులా మారిపోయింది. దీనికితోడు ఈ పుష్కరిణిలోనే గేదెలను కూడా విడచిపెట్టడం, వాటిని ఇక్కడే కడుగుతుండంతో పుష్కరిణి దుర్గంధభరితంగా తయారైంది. దీన్ని ఆలయ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, తామరతూడులతో నిండిపోయి కనీసం అడుగుపెట్టలేని విధంగా మారిపోయింది. కొందరు ఈ చెరువును చెత్తపారబోసే కేంద్రంగా కూడా మార్చివేశారు. ఈ పుష్కరిణి పరిస్థితిని చూసి ఆలయానికి వచ్చే భక్తులు ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఈ నేపథ్యంలో పుష్కరిణిని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో పుష్కరిణి చుట్టూ ఘాట్‌లు నిర్మించడంతో పాటు చెరువు అడుగు భాగంలో కాంక్రీటు నిర్మాణం, బోర్లు తవ్వించి ఓ పవిత్రమైన ఘాట్‌లా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. దీనికితోడు బయట నుంచి పుష్కరిణిలోని మురుగునీరు రాకుండా తీర్చిదిద్దనున్నారు. అలాగే ఆలయం పరిసరాలకు ఆనుకుని భక్తుల రాకపోకలకు వీలుగా ప్రత్యేకంగా రహదారికి కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. మొత్తమ్మీద ఎంతో కాలంగా నిరాదరణకు గురైన స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి అభివృద్ధికి అడుగులు పడడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




దుర్గంధపూరితంగా తయారైన స్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి ఇదే...

లక్ష్మీపురం రోడ్డులో ట్రాఫిక్ పద్మవ్యూహం

- రహదారి పక్కనే దుకాణాల ఏర్పాటు
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- చోడవరం ప్రజలు, వాహన చోదకుల పాట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు




దుకాణాల ఎదుట ఇష్టారాజ్యంగా నిలిపివేసిన వాహనాలతో గందరగోళంగా ఉన్న లక్ష్మీపురం రహదారి

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. ఇది ఓ రకంగా వాహన చోడకులు, స్థానిక ప్రజలకు సంకటంగా మారింది. ప్రధాన రహదారిలో లక్ష్మీపురం ఆర్చి నుంచి చలపతి స్కూల్ వరకూ రహదారి వెంబడి దుకాణాల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో తరచూ వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇదే రూటులో పలు ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు స్థానికంగా కాలనీలు ఉన్నాయి. వీరందరికీ ఇదే ప్రధాన మార్గం. అయితే లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి ఆర్చి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు రోడ్డుపైకి రావడంతో పాటు రోడ్డుకు ఆనుకుని షెడ్లు దించడంతో వినియోగదారులు తమ వాహనాలను అక్కడే నిలిపివేస్తున్నారు. దీంతో ఈ రహదారిలో రాకపోకలు సాగించే వారికి దారి లేక తరచూ ఇబ్బందులు పడుతున్నారు. తమ దుకాణాల ముందు నిలిపే వాహనాల విషయంలో దుకాణదారులు సైతం కనీసం పట్టించుకోవడం లేదు. సరికదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెడుతుండడంతో మహిళలు, పిల్లలు, విద్యార్థులకు కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ రహదారిలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పంచాయతీ అధికారులతో పాటు పోలీసులు కూడా చొరవచూపాలని, తమ ఇబ్బందులు తీర్చాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గంజాయి కేసుల్లో సూత్రధారులను అరెస్టు చేస్తాం

డీఎస్పీ మోహన్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో సూత్రధారులను కూడా అరెస్టు చేస్తామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ తెలిపారు. నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో డీఎస్పీ మాట్లాడుతూ గతంలో గంజాయి కేసులలో పట్టుబడ్డవారిని మాత్రమే అరెస్టు చేసేవారమని, ఇకపై గంజాయి కేసులలో సూత్రధారులను కూడా గుర్తించి అరెస్టు చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు గంజాయి కేసులలో పరారీలో ఉన్నవారిని గుర్తించి 24 మందిని అరెస్టు చేశామన్నారు. తమ పరిధిలో గంజాయి రవాణాను అరికట్టడానికి కృష్ణాదేవిపేట, భీమవరం, యర్రవరంలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, లైవ్ కెమెరాలు కూడా పెట్టామని చెప్పారు. అలాగే గ్రామాలలో నాటుసారా అరికట్టడానికి ప్రజల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. ఇటీవల సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మేసేజ్‌లు వస్తే లింక్ చేసి మోసపోవద్దని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.భీమరాజు పాల్గొన్నారు.

వరిలో కేళీలపై రైతులు ఆందోళన



గుమ్మిడిగొండలో ఆర్‌జేఎల్ రకం సాగులో కేళీలు

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాతవరం, గుమ్మిడిగొండ తదితర గ్రామాలలో ఆర్‌జేఎల్ వరి సాగు చేస్తున్న రైతులు పంట పొలాల్లో కేళీలు ఎక్కువగా ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో రైతుభరోసా కేంద్రాలలో ఎక్కువమంది ఆర్‌జేఎల్ రకం వరి విత్తనాలు తీసుకుని వరి నారు వేశారు. ఆర్‌జేఎల్ వరి ద్వారా వచ్చే బియ్యం తినటానికి బాగుంటాయని, అమ్మకోవడానికి ఎక్కువ ధర వస్తుందన్న భావంతో ఈ రకం పంటను వేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌జేఎల్ వరి పంట పొట్ట దశకు వచ్చే సమయంలో ఎక్కువగా కేళీలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుభరోసా కేంద్రాలలో అధికారులు సరఫరా చేసిన నాసిరకం విత్తనాలతో తాము మోసపోయామని వారు వాపోయారు. వ్యవసాధికారులు ముందుచూపు లేకుండా కేళీలు ఉన్న వరి విత్తనాలు సరాఫరా చేయడం దారుణమని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో యోగాకు మరింత గుర్తింపు తెస్తా

యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సతీశ్



సతీశ్‌ను సత్కరిస్తున్న పతంజలి కేంద్రం సభ్యులు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యోగా క్రీడకు మరింత గుర్తింపు తీసుకువస్తానని యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.సతీశ్ తెలిపారు. స్థానిక పతంజలి యోగా కేంద్రం సభ్యులు సతీశ్‌ను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన తనకు అసోసియేషన్ రాష్ట్ర సారథ్య బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగా క్రీడను ప్రోత్సహించి మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పతంజలి యోగా కేంద్రం సభ్యులు భోగవిల్లి గణేష్, రెడ్డి అప్పారావు, రవితేజ, ఉప్పల వెంకటేశ్ పాల్గొన్నారు.

జైతవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వం తీసుకున్న టీడీపీ నాయకులు

చీడికాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరం గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైతవరం ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు దోకల అక్కునాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైల వెంకటరమణ, నాయకులు రెడ్డి కాశీవిశ్వనాథం, కొనగల్ల శ్రీనివాసరావు, రెడ్డి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

పంతులబాబు విగ్రహం ఊరేగింపు



పుత్తడిగైరంపేటలో పంతులబాబు విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరామపురం గ్రామంలో ప్రసిద్ధి చెందిన పాకలపాడు పంతులుబాబు గురూజీ విగ్రహాన్ని కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఆదివారం పలుగ్రామాల్లో ఊరేగించారు. పుత్తడిగైరంపేట, పెనరాడ, కంఠారం, శుద్దలపాలెం గ్రామాల్లో ఊరేగింపు సాగింది. కార్తీక మాసం నెల రోజులూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ సభ్యుడు పత్తి రమణ తెలిపారు

అమ్మవాసవి సంఘం సేవలు అభినందనీయం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నాతవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమ్మవాసవి సంఘం నిరుపేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షురాలు ఇటంశెట్టి అక్కయ్యమ్మ ఆధ్వర్యంలో ఆదివారం వితంతువులు, మహిళల చీరలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలోనూ ఈ సంఘం పేదలకు ఎనలేని సేవలు అందించిందని చెప్పారు. అనంతరం పేదలకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత అపిరెడ్డి మాణిక్యం, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వీరసూర్యచంద్ర, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు బుల్లిదొర పాల్గొన్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

రోలుగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనాలు ఎక్కువగా సంచరించే ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని గ్రామస్థులు కొట్టి సంజీవరావు, మరిసా నరసింగరావు, మద్దు వెంకునాయుడు, బొందల ప్రసాద్, కొట్టి పైడియ్యనాయుడు, కొట్టి ప్రసాద్, మోపాడ పైడియ్యనాయుడు, ఒనుం బుజ్జి, కొట్టి భాస్కరరావు తదితరులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వందలాది మంది ప్రజలు తిరిగే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. దీనివల్ల మెయిన్ రోడ్డులో రాకపోకలకు సాగించే వాహన చోదకులు, మహిళలు, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వారు చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మద్యం దుకాణాన్ని తక్షణమే ఎత్తివేయాలని, ఊరుకు దూరంగా పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు

మాడుగుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు. న్యాయవాధులు శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోదులు ఆలయానికి వచ్చిన భక్తుకు ఉచిత అన్న సమారాదన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా చినబాబు



చినబాబు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా మెట్టపాలెంకు చెందిన కచ్చాల చినబాబును నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చినబాబు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు ఎం.సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలకు

గొలుగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని గొలుగొండ శాఖా గ్రంథాలయాధికారి రాజుబాబు చెప్పారు. మండల కేంద్రంలోని శాఖా గ్రాంథాలయంలో ఆదివారం చదవడం-రాయడం-ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలను చదుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలు, పేపర్లు చదువుతున్న విద్యార్థులు




సుపథ పోటీలకు హాజరైన విద్యార్థులు... విజేతలకు బహుమతులు అందిస్తున్న యూవీఎస్.రాజు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు

సుపథ పోటీలకు విశేష స్పందన

25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థుల హాజరు

దేవరాపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సుపథ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా పోటీలకు దేవరాపల్లి, వేపాడ తదితర మండలాలకు చెందిన 25 పాఠశాలల నుంచి 435 మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్లోక పఠనం, పద్యపఠనం, గేయాలు, వ్యాసరచన, వేద పఠనం, తెలుగు నేర్చుకుందాం, తెలుగు తెలుసుకుందాం, శ్రీకృష్ణ చరితామృతం, క్విజ్, వ్యాచరచన పోటీల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు మాట్లాడుతూ మాతృ భాషా పరిరక్షణకు అందరూ కృషిచేయాలని కోరారు. సుపథ రూపకర్త యూవీఎస్.రాజు మాట్లాడుతూ ప్రస్తుత తరానికి మానవతా విలువలు నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుపథ సభ్యులు కె.శ్రీనివాసు, బీవీ.దేముళ్లు, ఉదయ్‌కుమార్, డి.దేముడు, సూర్యానారాయణ, వై.త్రినాథ్, ఇట్లా నారాయణరావు, చిన్నంనాయుడు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంతువీధిలో కుంగిన సీసీ రోడ్డు

వాహన రాకపోకలకు ఇబ్బందులు

ప్రమాదాల బారిన ప్రజలు.. పట్టని అధికారులు



బొంతువీధిలో కుంగిన సీసీ రోడ్డు

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని బొంతువీధిలో సీసీ రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవాంతం ఏర్పడుతోంది. ఫలితంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. 22వ వార్డులోని వెంకునాయుడుపేట ప్రజలు ఇందిరా మార్కెట్, అబీడ్ సెంటర్ రావాలంటే ఈ రోడ్డునే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. బొంతువీధి కాలనీ వాసులు కూడా అబీడ్ సెంటర్ మెయిన్ రోడ్డుకు రావాలంటే ఈ రోడ్డు ఒక్కటే దిక్కు. సీసీ రోడ్డు కుంగిపోవడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ఏడేళ్ల క్రితం టీడీపీ పాలకవర్గంలో ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రోడ్డు మధ్యలో తవ్వేశారు. డ్రైనేజీ మీద సిమ్మెంటు పలకలు అమర్చారు. దీని వల్ల రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పక్కనే పెద్ద డ్రైనేజీ ఉంది. ఈ సమస్యకు తోడు తాజాగా సీసీ రోడ్డు కుంగిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

దత్తాశ్రమంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం ఉత్తర వాహిని తీరంలో ఉన్న దత్తాశ్రమంలో జ్యోతిష్య సిద్ధాంతి గుమ్మడు ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సమమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం విశేష పూజలో పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి విశిష్ఠ పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకులు ప్రసాద్ తెలిపారు. అనంతరం వందలాది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

సీఆర్టీల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును కోరారు. ఆదివారం అతన్ని కలిసి సమస్యలపై లిఖితపూర్వంగా వినతిపత్రం అందించారు. సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని, గిరిజన ప్రాంతాలలో ఉన్న ఆశ్రమ, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పీఆర్‌టీయూ కన్వీనర్ డీజీనాథ్, పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అప్పారావు, నాయకులు రామకృష్ణ, చిన్నారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై సచివాలయాల్లో వినతులు

- ఏపీ రైతు సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం అన్ని సచివాలయాల్లో వినతులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలక ప్రాజెక్టులతో పాటు ఇతర ఇరిగేషన్ వనరులను కూడా నిర్లక్ష్యం చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. అన్ని సచివాలయాల పరిధిలోని సాగునీటి వనరులను ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా సచివాలయాల్లో వినతులు అందచేయాలని ఆయన కోరారు.

8న భగవద్గీత శ్లోకాల పోటీలు

చోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రేమసమాజంలో టీడీపీ సహకారంతో ఈ నెల 8న విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించనున్నట్టు సంగీత పీఠం నిర్వాహకుడు రామయ్యరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో 18 సంవత్సరాల లోపు విద్యార్థులంతా పాల్గొనవచ్చన్నారు. విజేతలకు నగదు బహుమతులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.

శిల్పకళలో దిట్ట పరమేశ్వరరావు



అయ్యప్పస్వామి ఆలయం గోడపై పరమేశ్వరరావు రూపొందించిన పలు దేవుళ్ల విగ్రహాలు

దేవతామూర్తుల విగ్రహాల తయారీపై బాల్యంలోనే ఆసక్తి

- మనసులో మెదిలే రూపాలకు శిల్పావిష్కరణ
- పలువురు ప్రముఖుల చేతుల మీదుగా సత్కారాలు

(అనకాపల్లి టౌన్-ఆంధ్రజ్యోతి)

మనసులో మెదిలే దేవతామూర్తుల రూపాలను కళ్ల ఎదుట ఆవిష్కరింపజేయడం ఆయనకు ఉలితో పెట్టిన విద్య. ఆయన రూపొందించిన విగ్రహాల్లో జీవకళ ఉట్టి పడుతుంది. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధికి చెందిన విల్లూరి వెంకట పరమేశ్వరరావు శిల్పాల తయారీలో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో కూడా గుర్తింపుపొందారు. సుమారు నాలుగు దశాబ్దాల నుంచి వేలాది విగ్రహాలను ఆయన రూపొందించారు. ఎంతోమంది ప్రముఖుల చేతుల మీదుగా సన్మానాలు, సత్కారాలు పొందారు.



పశ్చిమబెంగాల్‌లోని ఆద్రాలో రెండు దశాబ్దాల క్రితం పరమేశ్వరరావు తయారు చేసిన 54 అడుగుల హనుమాన్ విగ్రహం

విల్లూరి వెంకట పరమేశ్వరరావు స్థానిక దాడి భోగలింగంనాయుడు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నప్పుడే శిల్పాలు, విగ్రహాల తయారీపై ఆసక్తిని పెంచుకున్నారు. అప్పట్లో పరమేశ్వరావు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే మార్గంలో పందూరి సత్యనారాయణ అనే శిల్పి విగ్రహాలు తయారు చేస్తుండేవారు. రోజూ స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయంలో ఆయన దృష్టంతా శిల్పాల తయారీపైనే ఉండేది. విగ్రహాలు, శిల్పాలను తయారుచేయాలన్న మక్కువతో సత్యనారాయణ వద్ద శిష్యుడిగా చేరారు. శ్రద్ధతో సాధన చేసి, గురువు వద్ద ఎన్నో మెలకువలు తెలుసుకున్నారు. కొంతకాలం తరువాత తానే సొంతంగా మట్టి, సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి ముడి పదార్థాలను వినియోగించి దేవతలు, జాతీయ నేతలు, దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకుంటూ జీవం ఉట్టిపడేలా విగ్రహాలు తయారు చేయడంలో పరమేశ్వరావుది అందె వేసిన చెయ్యి. అనకాపల్లిలోని పలు ఆలయాల్లో ప్రస్తుతం ఉన్న దేవతామూర్తుల విగ్రహాలు ఆయన చేతితో రూపుదిద్దుకున్నవి కావడం విశేషం. శిల్పకళ మీద మక్కువతో ఒకపక్క విగ్రహాలు తయారుచేస్తూనే మరోవైపు 1984-85లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. పర్యావరణ పరిరక్షణలో



శ్రీకృష్ణుని విగ్రహానికి తుది రూపు ఇస్తున్న శిల్పి పరమేశ్వరరావు

భాగంగా మట్టి విగ్రహాల తయారీపై పరమేశ్వరరావు దృష్టిసారించారు. ఆగస్టు 15వ తేదీ 2004లో లండన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఎం నాయుడు చేతుల మీదుగా శిల్పకళారత్న అవార్డును స్వీకరించారు. 2018లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.



పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కారం పొందుతున్న పరమేశ్వరరావు



రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో పరమేశ్వరరావును సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శిల్ప కళలో మైలురాళ్లు...

- అనకాపల్లి పట్టణంలోని పార్కు జంక్షన్ వద్ద గౌరీ పంచాయతన ఆలయం అయ్యప్పస్వామి ముఖద్వారాన్ని 2002లో పరమేశ్వరరావు తీర్చిదిద్దారు. దీంతో ఆలయ కమిటీ వారు స్వర్ణ కంకణంతో సత్కరించారు.
- బెంగాల్ రాష్ట్రంలోని ఆద్రా గ్రామంలో 2004వ సంవత్సరంలో 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని తయారు చేశారు. విష్ణు పంచాయతన ఆలయం నిర్మించి కమిటీ వారిచే స్వర్ణ కంకణంతో సత్కారం పొందారు.
- 2022లో దేమునిగుమ్మంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కుడ్యాలపై శ్రీవారి చరిత్రను బొమ్మల రూపంలో తీర్చిదిద్దారు.
- 2023లో అనకాపల్లి మండలం రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో దశావతారాల్లో దేవుళ్ల విగ్రహాలు తయారుచేసి చినజీయర్‌స్వామిచే సత్కారం పొందారు.
- అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో వున్న అయ్యప్పస్వామి దేవాలయంలో 2023లో స్వామివారి చరిత్రను బొమ్మల రూపంలో ఆవిష్కరించారు.
- దివంగత రాజ్యసభ సభ్యుడు వీవీ రమణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గత ఏడాది ఆయన (రమణ) విగ్రహాన్ని తయారుచేశారు. దీనిని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, పరమేశ్వరరావును సన్మానించారు.
- ఉమ్మడి కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో శ్రీకృష్ణుని విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దారు.

విదేశాల్లో విగ్రహాలు తయారు చేయాలన్నదే లక్ష్యం



విదేశాల్లో కూడా విగ్రహాలు తయారుచేసి మన్ననలు పొందాలన్నదే నా లక్ష్యం. స్థానిక ఎన్‌ఆర్‌ఐలు సహకరిస్తే అమెరికాతోపాటు మలేషియా, సింగపూర్, జపాన్ వంటి దేశాల్లో విగ్రహాలు తయారుచేస్తాను. తానా మహాసభల్లో పాల్గొనాలన్నది నా కోరిక. శిల్ప కళ ద్వారా పలువురికి ఉపాధి కల్పించి, శిల్పకళాకారులుగా తీర్చిదిద్దాలన్నదే ఆశయం. గతంలో నా వద్ద శిక్షణ పొందిన వారిలో కొంతమంది సొంతంగా విగ్రహాలు తయారుచేస్తుండడం ఆనందం కలిగిస్తున్నది.

- వి.వి.పరమేశ్వరరావు, శిల్పి

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రావణి



నిందితులకు కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

కొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడి హత్య కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలివి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినోద్‌కుమార్ (22), అతని సోదరుడు అమిత్‌కుమార్, రాంగోపాల్ ఈ ముగ్గురూ అనకాపల్లి మండలం కొప్పాక పారిశ్రామిక వాడలో ఉన్న ఓ స్టీల్ కంపెనీలో గత రెండున్నరేళ్ళుగా పని చేస్తున్నారు. కొత్తూరు నర్సింగరావుపేటలో ఉంటున్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో వీరు కొత్తూరు నర్సింగరావుపేటలో ఉన్న పాన్‌షాపు వద్దకు వెళ్లారు. వీరిలో ఒకరైన అమిత్‌కుమార్ వాటర్ బాటిల్ కొనుగోలుచేస్తుండగా, అక్కడే ఉన్న స్థానికులైన మడకా గణేశ్, వూడి యశ్వంత్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదికాస్త చినికి చినికి గాలివానలా మారింది. దీంతో గణేష్, యశ్వంత్‌లు పై ముగ్గురిపై దాడికి దిగారు. వీరిలో వినోద్‌కుమార్‌కు మొహంపై కొట్టడంతో ఒక్కసారిగా వెనక్కి పడిపోయాడు. వెంటనే అతనిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందినట్టు డీఎస్పీ చెప్పారు. అప్పటి నుంచి నిందితులు గణేశ్, యశ్వంత్ పరారీలో ఉన్నారు. రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి నిందితులను శనివారం రాత్రి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సుకోసం సాలాపువానిపాలెం వద్ద ఎదురుచూస్తున్న సమయంలో పట్టుకుని అరెస్టు చేశారన్నారు. నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు నాగేశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని ఎంజేపురంలో కర్ణం నాగేశ్వరరావు (45) ఆదివారం సాయంత్రం పొలంలో ఉన్న కొబ్బరి చెట్టుపైకి బొండాలను కోసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా జారి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు సీఐ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

దుర్మార్గ ఆలోచనలతోనే జగన్ ఓటమి

- శాప్ చైర్మన్ రవినాయుడు

విశాఖపట్నం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగన్ దుర్మార్గపు ఆలో చనల వల్లే వైసీపీ ఓడిపోయిందని ఏపీ క్రీడా సాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. క్రీడాకారుల ఆట స్థలాలను ఆక్రమించుకున్న అక్రమార్కుడు అని దుయ్యబట్టారు. ఆదివారం ఆయన రుషికొండ బీచ్‌కు ఆనుకుని ఉన్న శాప్ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటర్‌స్పోర్ట్స్ నిర్వహణకు ఎకరా భూమిని రుషికొండ బీచ్‌లో కేటాయించారన్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో శాప్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్ అసో సియేషన్, ఫెడ రే షన్లు అనేకపోటీలు నిర్వహించాయన్నారు. వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని అణగదొక్కిందని, క్రీడాకారుల ను సైతం నాశనం చేసిందని మండిపడ్డారు. జగన్ తన హెలిప్యాడ్ కోసం శాప్ ఆధీనంలో ఉన్న వాటర్‌స్పోర్ట్స్ స్థలాన్ని లాక్కున్నారన్నారు. ఆ భూమిని సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో పెట్టి శాప్ తిరిగి వెనక్కి తీసుకుంటుందన్నారు. అలాగే వాటర్ స్పోర్ట్స్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. ఆడుదాం ఆం ధ్రా పేరుతో పేద క్రీడాకారుల సొమ్ము కాజేసిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. డీఎస్డీఓ జా న్ గేలియోట్, లివిన్ అడ్వెంచర్స్ స్టేట్ కయాకింగ్, కనోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు పాల్గొన్నారు.



రవినాయుడు

సింహగిరిపై తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నమ్మాళ్వారు తిరు నక్షత్ర పూజలు రెండవ రోజు ఆదివారం కూడా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో తిరు నక్షత్ర పూజలు కొనసాగించారు. స్వామివారికి ఉపచారాలు సమర్పణ తరువాత మంత్ర పుష్పం, కర్పూనీరాజనాలిచ్చారు. రాజభోగ నివేదన వేళ మధ్యాహ్నం ప్రత్యేక నివేదనలు జరిపారు.



పారాయణలు చేస్తున్న అర్చకులు

'మిషన్ లైఫ్'తో కలిసి సాగుతాం

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు రూపొందించిన మిషన్ లైఫ్ పోస్టర్‌ను ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేసేందుకు ఈపీడీసీఎల్ పలు కార్యక్రమాలు చేపడుతోందని. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు సుస్థిర అభివృద్ధికి తోడ్పడనున్నామని చెప్పారు. బీఈఈ, పీపీఎస్‌ఈసీఎంతో కలిసి సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని యోచిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ సంస్థ సభ్యులు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా, చంద్రం, భాస్కర్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై నిఘా

... 5వ పేజీ తరువాయి

నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించడంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు చేపట్టేందుకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, పాయకరావుపేట ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని పలు గ్రామాల్లో ఇప్పటికే బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. తనిఖీ బృందాలు వీటిపై ఆకస్మిక దాడులు చేయనున్నాయి. అంతేకాక లైసెన్స్‌డ్ మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు మద్యం విక్రయించడంపై నిఘా పెట్టనున్నాయి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, బెల్ట్ షాపుల్లో మద్యం పట్టుబడినా సంబంధిత మద్యం షాపు నిర్వాహకులకు భారీ జరిమానా విధిస్తారు. తొలిసారి పట్టుబడితే రూ.5 లక్షల జరిమానా, రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తారు.

'ఎమ్మార్పీకే విక్రయించాలి'

ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొత్త గూడుకు మోక్షంలేదా?

... 5వ పేజీ తరువాయి

చేరడంతో నూతన భవనం నిర్మాణానికి 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్థలం కేటాయించింది. నూతన భవన నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే టెండర్ ఆహ్వానించడంలో జాప్యం చేసింది. ఈ ఏడాది మార్చి నెలలో టెండర్ పిలిచింది. తొమ్మిది నెలల కాల పరిమితిలో అంటే ఆ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు గడువు విధించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పనులు ప్రారంభమయ్యాయి. పునాదులు, పిల్లర్లు వేసిన తరువాత బిల్లుల మంజూరులో జాప్యం చేయడంతో కొంత కాలం పనులు నిలిచిపోయాయి. అయితే తాజాగా శ్లాబ్ వేయడానికి సెంట్రింగ్ పనులు జరుగుతున్నాయి. కొత్త భవన నిర్మాణం పూర్తయితే అందులోకి కార్యాలయాన్ని మార్చేందుకు అధికారులు ఎదురుచూస్తున్నారు. అయితే పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నక్కపల్లికి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తే సరిపోతుంది. రోడ్డు, రైలు, సముద్ర మార్గాలు అందుబాటులో వున్నాయి. ముడి సరకు దిగుమతి, ఉక్కు ఉత్పత్తుల ఎగుమతుల కోసం నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద శాటిలైట్ పోర్టు నిర్మాణం చేపట్టే అవకాశం వుంది. ఆర్సెలర్ మిట్టల్ ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తి చేసే కంపెనీల్లో రెండో స్థానంలో వుంది.

కాగా మన దేశంలో నాణ్యమైన ఇనుప ఖనిజం భారీ మొత్తంలో అందుబాటులో వుండడంతో తమ దేశ అవసరాల కోసం ఉత్తమ శ్రేణి ఉక్కు ఉత్పత్తి కోసం నక్కపల్లి ప్రాంతంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన నిప్పన్ కంపెనీ ఆసక్తిగా వున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. భారత్‌లో ముడిసరకు, మానవ వనరులు పుష్కలంగా వుండడంతోపాటు జపాన్‌తో పోలిస్తే భారత్‌లో ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తక్కువగా వుండడంతో నిప్పన్ స్టీల్ కంపెనీ ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్టు తెసింది. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజం, ఇతర ముడి సరకులను ఎన్ఎండీసీ సరఫరా చేసే అవకాశం ఉంది. స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదటి దశ నిర్మాణ పనులను 2029నాటికి పూర్తి చేస్తామని మిట్టల్ సంస్థ పేర్కొంది. మొదటి దశ పనులు పూర్తయితే రెండో దశ పనులకు 3,800 ఎకరాల భూములు కావాల్సి వుంటుందని మిట్టల్ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ప్రైవేటు సంస్థ కావడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సదుపాయాలు శరవేగంగా సమకూర్చే అవకాశాలు వుండడంతో ఐదేళ్లలో స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. కాగా నక్కపల్లి మండలంలో మెగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటైతే తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాయకరావుపేట నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఆశిస్తున్నారు.

7 నుంచి వీవోఏల నిరసనలు

- సంఘ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వెలుగు వీవోఏలుగా పనిచేస్తున్న యానిమేటర్లను ప్రతి మూడేళ్లకు మార్చాలనే సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఏడో తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నామని అం ధ్రప్రదేశ వెలుగు వీవోఏ (యానిమేటర్ల) ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో మాట్లాడారు. యానిమేటర్లకు చెల్లించాల్సిన ఐదు నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్.రూపాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదిలోనే వీవోఏలపై కత్తిగట్టిందని ఆరోపించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి, నేడు అందుకు భిన్నంగా ప్రకటనలు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి దశలవారీగా పోరాటం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఏడో తేదీన మండలాల్లో నిరసన తెలియజేసి, అధికారులకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. అలాగే 11, 12 తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు ఎం.రాజేష్, రాము, వై.లక్ష్మి, కె.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ లైఫ్' పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు రూపొందించిన మిషన్ లైఫ్ పోస్టర్‌ను ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం ఆశయాలకు అనుగుణంగా పని చేసేందుకు ఈపీడీసీఎల్ పలు కార్యక్రమాలు చేపడుతోందని. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు సుస్థిర అభివృద్ధికి తోడ్పడనున్నామని చెప్పారు. బీఈఈ, పీపీఎస్‌ఈసీఎం తో కలిసి ఈపీడీసీఎల్ సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని యోచిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ సంస్థ సభ్యులు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా, ఏపీ విద్యుత్ శాఖాధికారులు చంద్రం, భాస్కర్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో వ్యాపారి ఆత్మహత్య

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొవ్వూరు గణేశ్ (39) భార్య విజయకుమారి (32), కుమార్తెలు సరిత (17), కీర్తన (14)తో కలిసి లాసన్స్‌బే కాలనీ లోకమ్ స్ట్రీట్‌లో ఉంటున్నాడు. ఈనెల 30న అతను పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ప్రాంతంలోని ఓ హోటల్‌కు వెళ్లి రెండు రూమ్‌లు తీసుకుని, రూ.4 వేలు చెల్లించాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఒక్కరే వచ్చాడు. మధ్యాహ్నం బయటకు వచ్చి మళ్లీ లోపలికి వెళ్లిపోయాడు. తరువాత రాలేదు. ఆదివారం ఉదయం 10 గంటలకు హోటల్ బాయ్ డోర్ కొట్టగా తీయలేదు. రాత్రి ఎక్కువ సేపు మేల్కొని ఉన్నారేమోనని రూమ్ క్లీనర్స్ కూడా వెనుతిరిగారు. మధ్యా హ్నం రెండు గంటలకు హోటల్ సిబ్బంది రూమ్‌లో ఉన్న ల్యాండ్ ఫోన్‌కి కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి పీఎంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తీయగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడికి ద్వారకా నగర్‌తో పాటు రాజమండ్రి వరకు ఏసీలు, ఫ్రిడ్జ్‌లు అమ్మే 14 షోరూమ్‌లు కూల్‌జోన్ పేరుతో ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పాలకొండ అని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కాగా గణేశ్ చనిపోవడానికి ముందు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు క్షమించాలని, కుమార్తెలు ధైర్యంగా ఉండాలని కోరాడు. తన మృతికి కారణం వ్యాపారంలో పక్క షోరూమ్ నిర్వాహకులు తక్కువ ధరకు వస్తువులను విక్రయించడంతో పాటు తన షోరూమ్ నుంచి వచ్చేవారికి మరింత తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు.

పంచారామ దర్శని బస్సులు ప్రారంభం



ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీమాసంలో వచ్చే సోమవారాల్లో పంచారామాలు దర్శించుకోవాలనుకునే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన మూడు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ వీటిని ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయల్దేరిన బస్సులు సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుంటాయి. అక్కడ స్వామివారిని దర్శించుకుని, అనంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలను సందర్శించి రాత్రికి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ప్రతి ఆదివారం సాయంత్రం పంచారామదర్శని స్పెషల్ ప్యాకేజీ బస్సులు బయల్దేరుతాయని ద్వారకా డిపో మేనేజర్ గంగాధర్ వెల్లడించారు.